teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 02 | సంచిక : 357 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | మంగళవారం | 30 ఏప్రిల్ 2024 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## నేడే పదవ తరగతి పరీక్ష ఫలితాల విడుదల

**ఫలితాలకు విడుదల చేసేందుకు ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్**

హైదరాబాద్, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): మంగళవారం ఉదయం తెలంగాణలో 10వ తరగతి పరీక్షా ఫలితాలు కాబోతున్నాయి. టెన్త్ రిజల్ట్స్ ను నేడు విడుదల చేయడానికి విద్యాశాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి

మిగతా 2 లో







# రాష్ట్రంలో బీర్ల కొరత

**ఆందోళన వ్యక్తం చేస్తున్న మందుబాబులు**

**బీర్ల కొరతను సృష్టిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): వేసవి కాలంలో మందుబాబులు బీర్లు తాగడానికే ఎక్కువ మొగ్గు చూపుతారు. ముచ్చెమటలు పట్టించే ఈ వేడి వాతావరణంలో చల్లని బీర్లు తాగితే హాయిగా ఉ ంటుందని వాళ్లు భావిస్తారు. అందుకే వేసవిలో బీర్ల కోసం మద్యం షాపుల

మిగతా 2 లో



## ఏం లేనప్పుడే బీఆర్ఎస్ వాళ్లకు చెమటలు పట్టించాను

**కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది వారిని బయట తిరగనిస్తామా**

**ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): ఏం లేనప్పుడే మునుగోడులో రాజీనామా చేసి మూడు నెలల పాటు బీఆర్ఎస్ వాళ్లకు చెమటలు పట్టించాను. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది వారిని బయట తిరగనిస్తామా అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం భువనగిరి లోక్ సభ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కమార్ రెడ్డి

మిగతా 2 లో

## గల్లీలో.. ఢిల్లీలో లేని కారును గెలిపిస్తే మిగిలేది శూన్యమే

**కేసిఆర్ నూరు అబద్ధాలు.. రేవంత్‌రెడ్డి వెయ్యి అబద్ధాలు**

**లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఎం. రఘునందనరావు**



సిద్దిపేట, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): గల్లీలో లేని ఢిల్లీలో లేని కారును గెలిపిస్తే మనకు మిగిలేది శూన్యమేనని మెదక్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఎం. రఘునందనరావు అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఎన్నో రేవంత్ రెడ్డి ఎన్నో హామీలు ఇచ్చారని అయితే కొలువు తీరిన కాంగ్రెస్ సర్కార్ ఐదు నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. సిద్దిపేట జిల్లా

మిగతా 2 లో

## పట్టభద్రుల "ఎమ్మెల్సీ" అభ్యర్థులకై బీఆర్ఎస్, బీజేపీల

# దేవులాట

**మూడు ఉమ్మడి జిల్లాల్లో ప్రభావం చూపేలా ఉపఎన్నిక**

**సమస్యగా మారిన అభ్యర్థి ఖరారు**

**సిట్టింగ్ రాజీనామాతో డైలమాలో బీఆర్ఎస్**

**అభ్యర్థి వెతుకులాటలో బీజేపీ**

**ఉపఎన్నికలో గెలవడం మరింత ప్రతిష్టాత్మకం**

**ఇప్పటికే అభ్యర్థిని ప్రకటించిన కాంగ్రెస్**




బీఆర్ఎస్ ను చుట్టుముడుతున్న సమస్యలు అన్నీ ఇన్నీ కావు. లోక్ సభ ఎన్నికలతో కిందా మీదా పడుతున్న సమయంలోనే మూడు ఉమ్మడి జిల్లాల్లో ప్రభావం చూపేలా మరో ఉపఎన్నిక వచ్చి పడింది. అదే ఖమ్మం, నల్గొండ, వరంగల్, పట్టభద్రుల ఉపఎన్నిక. మూడేళ్ల క్రితం ఎమ్మెల్సీగా పల్లా రాజేశ్వర్ రెడ్డి ఈ స్థానం నుంచి గెలిచారు. ఆయన జనగామ ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు. దాంతో రాజీనామా తప్పనిసరి అయింది. ఉపఎన్నిక వచ్చేసింది.

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్నను ప్రకటించారు. ఆయన గతంలోనూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో ఉన్నారు. బీఆర్ఎస్ కు ఇది సిట్టింగ్ స్థానం. తమ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి రాజీనామా వల్ల వచ్చిన ఉపఎన్నిక. అందుకే గెలవడం మరింత

మిగతా 2 లో

## తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుంది

**కేసీఆర్ పై కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యలు**

**కేసీఆర్ ఫ్యామిలీ ప్రజలను మోసం చేసిందని తీవ్ర విమర్శలు**

.. వివరాలు 2లో





## మోడీ ప్రభుత్వంలో "పుడితే పన్ను, చస్తే పన్ను"

**దేవుళ్ళను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తోంది బీజేపీ**

**ఎన్నికల ప్రచారంలో మంత్రి సీతక్క వ్యాఖ్యలు**

.. వివరాలు 2లో

## ఎన్నికల్లో గెలుపుకు ఈడీ, సీబీఐని వాడుకోవడం

# మోడీకి అలవాటే

**ఓటుతో మోదీ, అమిత్‌షాకు బుద్ధి చెప్పాలని రేవంత్‌రెడ్డి పిలుపు**



**ఎన్నికల్లో గెలిచేందుకు, ప్రత్యర్థుల్ని ఇరుకున పెట్టేందుకు ఈడీ, సీబీఐని వాడుకోవడం మోదీకి అలవాటేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌కు ఢిల్లీ పోలీసులు వచ్చిన సమయంలో సీఎం రేవంత్ రెడ్డి కర్నాటకలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. ఢిల్లీ పోలీసుల నోటీసులపై ఆయన స్పందించారు. ఓటుతో మోదీ, అమిత్‌షాకు బుద్ధి చెప్పాలని సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): బీజేపీపై పోరాడే వారికి అమిత్ షా నోటీసులు పంపిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. బీజేపీను ప్రశ్నించాననే కారణంతోనే తనకు నోటీసులు పంపినట్లు వెల్లడించారు. ఢిల్లీ పోలీసులు పంపిన నోటీసులకు ఎవ్వరూ భయపడేవారెవరు లేరని తెలంగాణ, కర్ణాటకలో బీజేపీని తప్పకుండా ఓడించి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో

మిగతా 2 లో

## జోడో యాత్ర చేసిన చోటల్లా నాయకుల రాజీనామా

**రేవంత్ కు ముఖ్యమంత్రి అయ్యాననే భావన లేదు**

**రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు**



తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెడ్డీలు విప్పుతాడని, పేగులు మెడలో వేసుకుంటాడని, కండ్లను తీసి బాల్ ఆడుకుంటాడని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. రేవంత్ కు ముఖ్యమంత్రి అయ్యాననే భావన లేదని, ఆయన ఏదైనా మాట్లాడగలడని ఘాటు వ్యాఖ్యలు చేశారు. రాహుల్ గాంధీ ఎక్కడ

మిగతా 2 లో

## స్థానిక ఎన్నికలకు అధికారుల

# కసరత్తులు షురూ

**ఈ జోష్ లోనే దూకుడుగా వ్యవహరించడానికి కాంగ్రెస్ నిర్ణయం**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్) లోక్ సభ ఎన్నికలు కాగానే రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయా? అందుకనుగుణంగా అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారా? అంటే అవుననే అంటున్నాయి ప్రభుత్వ

మిగతా 2 లో




## నామినేషన్ల రిజెక్ట్ ఆమోదం ఉత్కంఠకి తెరపడింది

**మొత్తం 1488 నామినేషన్లకు గాను 1060 నామినేషన్ల ఆమోదం**

**వివరాలు ప్రకటించిన ఎలక్షన్ కమిషన్**




తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో ఏప్రిల్ 25 తో లోక్ సభ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. మొత్తం 1488 నామినేషన్లు దాఖలు కాగా, వీటిలో ఎన్ని రిజెక్ట్ అయ్యాయి, ఎన్ని ఆమోదం పొందాయో

మిగతా 2 లో

## పట్టభద్రుల "ఎమ్మెల్సీ" అభ్యర్థులకై బీఆర్ఎస్, బీజేపీల దేవులాట

**మొదటి పేజీ తరువాయి**

ప్రతిష్టాత్మకం. కానీ ఇప్పుడు అభ్యర్థిగా ఎవరిని దింపాలన్నది సమస్యగా మారింది. ఎవరూ పోటీకి ముందుకు రావడం లేదు. ప్రచార గడువు కూడా లేదు. మే రెండోతేదీ నుంచి నామినేషన్లు వేయాల్సి ఉంటుంది. లోక్ సభ ఎన్నికల పోలింగ్ 13వ తేదీన జరుగుతుంది. అభ్యర్థిని నిలబెడితే గెలవాలని కనీసం రెండో స్థానంలో ఉండాలి. కనీస ఓట్లు కూడా రాకపోతే పరువుపోతుంది. ఇప్పుడు బీఆర్ఎస్ ది అదే పరిస్థితి. పోటీ చేస్తే కనీస ఓట్లు వస్తాయన్న నమ్మకం లేదు. పోటీ చేయకపోతే పారిపోయారని అంటారు. ఏం చేయాలన్నది వారం రోజుల్లో డిసైడ్ చేసుకునే అవకాశం ఉంది.

## ఏం లేనప్పుడే బీఆర్ఎస్ వాళ్లకు చెమటలు పట్టించాను

**మొదటి పేజీ తరువాయి**

తరపున చేర్యాలలో ప్రచారం నిర్వహించిన రాజగోపాల్ రెడ్డి. కేసీఆర్ అయ్యా జాగిరి అయినట్లు తెలంగాణను 33 జిల్లాలను ఏర్పాటు చేశారు. అల్లుడికి ఓ జిల్లా, కొడుకో జిల్లా ఇచ్చాడు. ఎవడు చేయమన్నాడు 33 జిల్లాలు. 20 జిల్లాలు చేస్తే చాలు. ఒకప్పుడు చేర్యాల, జనగామ అంటే ఎంత బాగుండేది. ఈ హరీశ్ రావు ఇష్టం వచ్చినట్లు మండలాలు చేశాడు. చేర్యాల వాళ్లు ఒక పని మీద హుస్నాబాద్, మరో పని మీద సిద్దిపేట, ఇంకో పని కోసం మరో చోటకు వెళ్లాల్సి వస్తోందని ధ్వజమెత్తారు. ఇదేమన్న హరీశ్ రావు జేబు సంస్థనా. ఎంపీ ఎన్నికలు అవ్వగానే హరీశ్ రావును కూడా బొక్కలో వేస్తామన్నారు. బీఆర్ఎస్ పాలనలో జోకర్ గాళ్లు, బ్రోకర్ గాళ్ళు ఎక్కువని, పదేళ్ల పాటు అధికారాన్ని అడ్డం పెట్టుకుని కేసీఆర్ కుటుంబం దోచుకున్నదంతా కక్కిస్తామన్నారు. వీరందరిని జైలుకు పంపిస్తామన్నారు. వీరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. జనగామలో పల్లా రాజేశ్వర్ రెడ్డి దొంగ ఓట్లతో గెలిచాడని ధ్వజమెత్తారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగం చేసి పోలీసు వాహనాల్లో డబ్బులు తరలించి 39 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్ గెలుచుకుందని రేపు విచారణ జరిగి ఆ 39 మంది ఎమ్మెల్యేల పదవులు పోతాయని హాట్ కామెంట్స్ చేశారు. ప్రస్తుతం ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ కొనసాగుతోందని చెప్పారు. లక్ష కోట్ల అప్పు చేసి కాళేశ్వరం ప్రాజెక్టు అప్పుడే ఎలా కూలింది. నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్ రావు కాళేశ్వరం మీద ఎన్ని కమిషన్లు సంపాదించాడు? హరీశ్ రావు పొద్దున పొద్దునే తిరుగుతున్నాడు. ఇక తిరుగుడు బంజేసి జైల్లోకి వెళ్లి పడుకోవాలన్నారు. గతంలో ఈ ప్రాంతం తనకు అత్యధిక మెజార్టీ ఇచ్చిందని ఇప్పుడు నా తమ్ముడు చామల కిరణ్ కుమార్ ను భారీ మెజార్టీతో గెలిపిస్తే చెర్యాలకు డీలిమిటేషన్ లో భాగంగా నియోజకవర్గం చేస్తామన్నారు.

## గల్లీలో.. ఢిల్లీలో లేని కారును గెలిపిస్తే మిగిలేది శూన్యమే

**మొదటి పేజీ తరువాయి**

దుబ్బాకలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో మెదక్ పార్లమెంట్ కిసాన్ మోర్చా సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రఘునందనరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రిగా కేసీఆర్ నూరు అబద్ధాలు ఆడితే ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి వెయ్యి అబద్ధాలు ఆడేందుకు సిద్ధంగా ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులకు ఎరువుల కోసం చెప్పులు లైన్‌లో పెట్టిన విషయం మరవద్దంటూ ప్రజలకు రఘునందనరావు సూచించారు. కేంద్రంలో నరేంద్ర మోడీ వచ్చిన తర్వాత దేశంలో ఎక్కడ ఎరువుల కొరత అనేదే లేకుండా చూశారని చెప్పారు. కమలం గుర్తుకు ఓటు వేసి తనను నరేంద్ర మోడీ నాయకత్వంలో పని చేసేందుకు పంపాలని ఈ సందర్భంగా ప్రజలకు రఘునందనరావు మనవి చేశారు. ఇక దుబ్బాక నియోజకవర్గం మీద బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డికి అవగాహన లేదన్నారు. ఆయనకు డబ్బులు పెట్టి ఓట్లు కొనడం మాత్రమే తెలుసునని చెప్పారు. ఓటర్లను బానిసలుగా చూసే సంస్కారం కొత్త ప్రభాకర్ రెడ్డిదని అభివర్ణించారు. ఎంపీ ఎన్నికలు పూర్తికాగానే కొత్త ప్రభాకర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ లో చేరడం ఖాయమని స్పష్టం చేశారు.

## తెలంగాణను కేసీఆర్ కుటుంబం దోచుకుంది

**మొదటి పేజీ తరువాయి**

వరంగల్, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): కేసీఆర్ పై ఎమ్మెల్యే కడియం శ్రీహరి సంచలన వ్యాఖ్యాలు చేశారు. తెలంగాణ వనరులను కేసీఆర్ కుటుంబం దోచుకుందన్నారు. భూ కబ్జా కేసులు, ఫోన్ టాపింగ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న కేసీఆర్ ఫ్యామిలీ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని తీవ్ర విమర్శలు చేశారు. రాష్ట్రంలో అవినీతికి కారణం కేసీఆర్ అని మండిపడ్డారు. తెలంగాణకు అసలు మోసగాడు కేసీఆర్ అని దుయ్యబట్టారు. కాకతీయ వారసులుగా చెప్పుకునే అవకాశం లేకుండా వరంగల్ ను కేసీఆర్.. 6 ముక్కలు చేశాడన్నారు కడియం. రాబోయే 3 నెలల్లో రాష్ట్రంలో అద్భుతం జరగబోతోందని.. బీఆర్ఎస్ ఇక రాష్ట్రం లో మూత పడబోతోందని అన్నారు. ఒక్క పార్లమెంట్ స్థానంలోనూ బీఆర్ఎస్ గెలవదని చెప్పారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్య నే పోటీ ఉంటుందన్నారు. వ్యక్తిగత విమర్శలు మానుకుని పార్టీనీ కాపాడుకోవడాని కేసీఆర్ ప్రయత్నం చేయాలని సూచించారు. ఎవ్వరికీ పరిచయం లేని... సంబంధం లేని వ్యక్తినీ నిలబెట్టి వరంగల్ లో బీజేపీని పరోక్షంగా గెలిపించేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారన్నారు. తనను తిట్టడానికే రాజయ్య ను జీతానికి పెట్టుకున్నారని విమర్శించారు. వరంగల్ పై కేసీఆర్ కు ఒక రకమైన కోపం ఉందని.. ప్రశ్నించే వ్యక్తులు ఇక్కడ ఎక్కువ కాబట్టే.. వరంగల్ ను ముక్కలు చేశారన్నారని చెప్పారు. బయటకు కనిపించేది వేరు...కేసీఆర్ లోపల అసలు నిజ స్వరూపం వేరని ఆయన అన్నారు. కేసీఆర్ కుటుంబానికి హైదారాబాద్ చుట్టూ వేల ఎకరాలు ఎలా వచ్చాయని కడియం శ్రీహరి ప్రశ్నించారు.

## మోడీ ప్రభుత్వంలో "పుడితే పన్ను, చస్తే పన్ను"

**మొదటి పేజీ తరువాయి**

ఆదిలాబాద్, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): మోడీ ప్రభుత్వంలో పుడితే పన్ను, చస్తే పన్ను అంటూ మంత్రి సీతక్క మండిపడ్డారు. ఆదిలాబాద్ జిల్లా జైనాథ్, బేల మండలాల్లో మంత్రి సీతక్క ఎన్నికల ప్రచారంలో భాగంగా మట్లాడుతూ బీజేపి దేవుళ్ళను అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేస్తుందన్నారు. పదేళ్ళలో ఎం అభివృద్ధి చేయలేదు కాబట్టే దేవుడి పేరు చెప్పుతున్నారని అన్నారు. అడిగితే అయోధ్య కట్టాము అనే బిజేపి నేతల్ని ఊరులో చేసిన అభివృద్ధి, గుడికి ఇచ్చిన నిధులేంటో అడగండని తెలిపారు. రేవంత్ రెడ్డి దమ్మున్న నాయకుడు ఇచ్చిన మాట నిబెట్టుకొనే మనిషి అన్నారు. రుణ మాఫీ చేసి తీరుతాం.. రైతు బంధు రాని వారు అధైర్య పడొద్దు ఇస్తామన్నారు. గతంలో బీజేపి ఎంపిని గెలిపిస్తే ఇక్కడ ఏం చేసారు అది అడగాలని తెలిపారు. కేసీఆర్ 7 లక్షల కోట్ల అప్పులు చేసి పోయాడన్నారు. పేదోళ్ళకి కరెంట్ కట్ చేశాడు, ఫాం హౌస్ లకు కరెంట్ ఫ్రీ ఇచ్చాడని తెలిపారు. కానీ కాంగ్రెస్ అధికారం లోకి వచ్చాక 2వందల యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అన్నారు. మహిళ లకు బస్ ప్రయాణం ఉచితం చేశామన్నారు. మాట ఇస్తే మడమ తిప్పని పార్టీ కాంగ్రెస్ అన్నారు. మోడీ వచ్చాక మహిళలు బంగారం తాకట్టు పెట్టే పరిస్తితి వచ్చిందని అన్నారు. పన్నుల రూపంలో పేదోళ్ళని మరింత కష్టాల్లోకి నెట్టారన్నారు. మోడీ ప్రభుత్వంలో పుడితే పన్ను, చస్తే పన్ను అన్నారు. కట్టుకునే బట్ట పైన ,తినే రొట్టె పైన పన్ను అన్నారు. కాంగ్రెస్ అంటేనే ఉచిత కరెంట్ కు పేటెంట్ అన్నారు. ఉపాధి పథకం కాంగ్రెస్ పార్టీ తెచ్చిందన్నారు. రాహుల్ ది త్యాగాల కుటుంబం అన్నారు. బీజేపి చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

## నేడే పదవ తరగతి పరీక్ష ఫలితాల విడుదల

**మొదటి పేజీ తరువాయి**

చేశారు. నేడు ఉదయం 11 గంటలకు పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం ఫలితాలను విడుదల చేయనున్నారు. ఫలితాలు ఆన్ లైన్ లో విడుదల కాబోతున్నాయి. పదో తరగతి పరీక్షా ఫలితాలకు విడుదల చేసేందుకు ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పదో తరగతి పరీక్షల ఫలితాలను బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్ సైట్ %ట్ట్రజూం://తీవంబశ్రీం.ఎంవ్వశ్రీఖఅస్త్రుఖు.శీతీస్త్ర% లో చెక్ చేసుకోవచ్చు. కాగా, మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు పదో తరగతి పరీక్షలు జరిగాయి. దాదాపు 5.08 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరిలో 2,50,433 మంది బాలికలు%ౌ% 2,57,952 మంది బాలురు పరీక్షలకు హాజరయ్యారు. జవాబు పత్రాల మూల్యాంకనం ప్రక్రియ ఏప్రిల్ 13 నాటికి పూర్తయింది.

# నామినేషన్ల ఉత్కంఠకి తెరపడింది




**మొదటి పేజీ తరువాయి**

అనే ఉత్కంఠకి తెరపడింది. ఈసీ అధికారిక వెబ్సైట్ లో ఆ వివరాలను వెల్లడించింది. తెలంగాణలో మొత్తం 1488 నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపింది. వీటిలో 1060 నామినేషన్లు ఆమోదించగా, 428 నామినేషన్లు తిరస్కరించబడ్డాయి.
అయితే, మొత్తం 893 మంది అభ్యర్థులు వేసిన నామినేషన్లలో స్వయంగా అభ్యర్థులు, వారి సపోర్టర్లు అదనంగా వేసిన 268 నామినేష్లలు రిజెక్ట్ అయ్యాయి. స్క్రూటినీటి తర్వాత 625 మంది అభ్యర్థులు బరిలో ఉండనున్నారు. రాష్ట్రంలోనే అతిపెద్ద నియోజకవం-గ్గమైన మల్కాజిగిరిలో అత్యధికంగా 177 నామినేషన్ పత్రాలు సమర్పించగా వీటిలో 115 నామినేషన్లు తిరస్కరణకు గురవడంతో, కేవలం 62 మాత్రమే ఆమోదించబడ్డాయి. అలాగే పత్రాలను దాఖలు చేసిన 114 మందిలో 77 మంది రిజెక్ట్ అయ్యి అత్యధికంగా తిరస్కరించబడిన వారి సంఖ్యలోనూ మల్కాజిగిరి టాప్ లో నిలిచింది. ఈ నియోజకవర్గం నుండి 37 మంది బరిలో ఉండనున్నారు.
మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి అత్యధికంగా 53 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, భువనగిరిలో 51 మంది ఉన్నారు. పెద్దపల్లి నియోజకవర్గం నుంచి 49 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో అత్యల్పంగా 13 మంది అభ్యర్థులు, నాగర్‌కర్నూల్ నుంచి 21 మంది పోటీలో ఉండనున్నారు. వరంగల్ 48 మంది, జహీరాబాద్ 26 మంది, కరీంనగర్ 33 మంది, సికింద్రాబాద్ 46 మంది, హైదరాబాద్ 38 మంది, మహబూబాబాద్ 25 మంది, ఖమ్మం 41 మంది, చేవెళ్ల 46 మంది, నిజామాబాద్ 32 మంది, మహబూబ్ నగర్ 35 మంది, నల్గొండ నుంచి 31 మంది పోటీలో ఉన్నారు. అయితే నామినేషన్ల ఉపసంహరణ తర్వాత ఈ సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉంది.

# రాష్ట్రంలో బీర్ల కొరత

**మొదటి పేజీ తరువాయి**

ముందు క్యూ కట్టేస్తారు. బహుశా ఇలా ఎగబడటం వల్లనో లేక మరే ఇతర కారణమో తెలీదు కానీ ఈ వేసవిలో కింగ్‌ఫిషర్ లైట్ బీర్లు పెద్దగా అందుబాటులో లేవు. తెలంగాణ రాష్ట్రంలో వాటి కొరత ఏర్పడింది. ఎక్కడో కొన్ని షాపుల్లో మాత్రమే కొద్దిమొత్తంలో దొరుకుతుంటే మిగతా షాపుల్లో మాత్రం లేవు. ఈ నేపథ్యంలోనే మందుబాబులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ బీర్ల కొరతపై మంచిర్యాలలోని తాగుబోతుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. సరిపడా బీర్లను అందుబాటులో ఉంచాలని కోరారు. వ్యాపారులే బీర్ల కొరతను సృష్టిస్తున్నారని.. ఖరీదైన బీర్ల విక్రయాల్ని పెంచుకోవడం కోసమే లైట్ బీర్లను మార్కెట్‌లోకి తీసుకురావడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. బీర్ల కొరతను సృష్టిస్తున్న వ్యాపారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి లైట్ బీర్లను అమ్మడం లేదని పేర్కొన్నారు. రాష్ట్రానికి ఆదాయం తీసుకురావడంలో మందుబాబుల పాత్ర ఎంతో కీలకమైందని, అలాంటి తమను ఆదుకోవాలని, కింగ్‌ఫిషర్ లైట్ బీర్లను అందుబాటులోకి తేవాలని కోరారు. కొన్ని రోజులుగా మంచిర్యాలలో కేఎఫ్ లైట్ బీర్లు ఏ షాప్‌లో గానీ, బార్లలో గానీ లభ్యం కావడం లేదని.. దీంతో ఈ మండుటెండల్లో దాహం తీర్చుకోవడానికి జనాలు ఇబ్బందులకు గురవుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. స్ట్రాంగ్ బీర్లు తాగడం ద్వారా కడుపులో మంట, తలనొప్పి, వాంతులు వస్తున్నాయని ఫిర్యాదులు అందుతున్నాయని.. కాబట్టి వైన్ షాప్స్, బార్లలో లైట్ బీర్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రతి ఒక్కరి తరపున తాను కోరుతున్నానని ఆ అధ్యక్షుడు చెప్పారు. ఈ విషయంలో తమకు సహకరిస్తే.. రాష్ట్ర ఆదాయాన్ని రెట్టింపు చేయడంలో తాము కృషి చేస్తామని తెలియజేశారు. ఇదిలావుండగా కొన్ని రోజుల క్రితమే సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక నియోజకవర్గంలో బీర్ల విషయమై పెద్ద గొడవ జరిగిన సంఘటన అందరికీ గుర్తుండే ఉంటుంది. ఓ వైన్ షాప్‌లో బీర్లు లేవని చెప్పినందుకు, మద్యం ప్రియులు ఆందోళన చేపట్టారు. వారిని సముదాయించేందుకు ఏకంగా పోలీసులు రంగంలోకి దిగారంటే, వ్యవహారం ఎక్కడిదాకా వెళ్లిందో అర్థం చేసుకోవచ్చు. చివరికి పోలీసులపైనే వారు చెయ్యి చేసుకునే స్టేజ్‌కి గొడవ చేరింది. ఏం చేసుకుంటారో చేసుకోండి అంటూ సవాల్ విసిరారు. సుమారు గంటసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. చివరికి మందుబాబుల్ని స్టేషన్‌కి తీసుకెళ్లి.. వారికి కౌన్సిలింగ్ ఇచ్చి, తిరిగి ఇంటికి పంపించారు.

## జోడో యాత్ర చేసిన చోటల్లా నాయకుల రాజీనామా

**మొదటి పేజీ తరువాయి**



జోడో యాత్ర చేస్తే అక్కడ కాంగ్రెస్ కు ఎంతో మంది నాయకులు రాజీనామా చేసి వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కు మోడీని విమర్శించేందుకు ఏ రకమైన అంశాలు దొరకడం లేదన్నారు. అభివృద్ధి, సంక్షేమం విషయంలో కాంగ్రెస్ పాలన, బీజేపీ పాలనతో పోలిస్తే నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. కాంగ్రెస్ బీజేపీపై అనేక రకాలుగా తప్పుడు ఆరోపణలు చేసినా ప్రజలు వారిని నమ్మలేదని కిషన్ రెడ్డి తెలిపారు. బీజేపీ పాలనపై అవినీతి ఆరోపణ చేయలేదంటే పాలన ఎలా కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చని తెలిపారు. ఏ రంగంలో అయినా మోడీ పాలనను తప్పు పట్టే అవకాశం లేకుండా అభివృద్ధి చేశారన్నారు. దుర్మార్గపు, అబద్ధపు, విష ప్రచారాలను కాంగ్రెస్ చేస్తోందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని కాంగ్రెస్ గోబెల్స్ ప్రచారం చేస్తోందని, దీనిపై రేవంత్ కు కల వచ్చిందో రాహుల్ కు కల వచ్చిందోనని సెటైర్లు వేశారు. కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారానికి సంబంధించి ఒక్క సాక్ష్యాన్ని అయినా చూపించాలని రేవంత్ రెడ్డిని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను నీరుగార్చిందే కాంగ్రెస్ అని కిషన్ రెడ్డి ఫైరయ్యారు. మతపరమైన రిజర్వేషన్లను అమలు చేస్తూ బీసీలకు విద్య, వైద్యాన్ని అందకుండా చేస్తోంది కాంగ్రెస్సేనని ధ్వజమెత్తారు. సిద్దిపేటలో అమిత్ షా చేసిన ఉపన్యాసాన్ని కాంగ్రెస్ మార్ఫింగ్ చేసిందని కిషన్ రెడ్డి విమర్శలు చేశారు. ఆ పార్టీ పరిస్థితి ఎంత దిగజారిందో దీని ద్వారా అర్థం చేసుకోవచ్చన్నారు. అన్ని కులాలకు రిజర్వేషన్లు కల్పించడమే కాంగ్రెస్ ఎజెండా అని సీఎం అంటున్నాడని, కానీ రాష్ట్రంలో బీసీలకు మాత్రం అన్యాయం జరుగుతోందన్నారు. వారి రిజర్వేషన్లు వారికే దక్కాలంటే అది బీజేపీ వల్లే సాధ్యమని కిషన్ రెడ్డి తెలిపారు. రేవంత్ కు ప్రచారంలో ఏం చెప్పాలో కూడా అర్థం కాని పరిస్థితి ఉందని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని కూడా చెప్పలేని స్థితిలో ఆయన ఉన్నారని, తమ ప్రధాని అభ్యర్థి ఎవరో కూడా చెప్పలేదన్నారు. రాహుల్ సమర్థ నాయకుడని కూడా చెప్పలేదని చురకలంటించారు. సోనియాగాంధీ పుట్టింది ఇటలీలో కాదు, భారత్ లో అని కూడా ఆయన చెప్పలేదన్నారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని చెప్పి కూడా ఓట్లడగలేని పరిస్థితిలో రేవంత్ ఉన్నారని విరుచుకుపడ్డారు. దేవుళ్లపై రేవంత్ చేసే ప్రమాణాలతో ప్రజలకు న్యాయం జరగదని, ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ లోక్ సభ ఎన్నికల ప్రచారానికి ఎక్కడ స్పందన లేదని, ఆ పార్టీపై అందరూ నిరాశ, నిస్పృహలో ఉన్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో తొందరపడి ఓటు వేశామా? అని ప్రజలు ఆలోచన చేస్తున్నారని పేర్కొన్నారు. అమిత్ షా వ్యాఖ్యలను మార్ఫింగ్ చేయడంపై కేసు పెట్టామని, ఎన్నికల కమిషన్ కు కూడా ఫిర్యాదు చేశామని కేంద్ర మంత్రి తెలిపారు. రేవంత్ రెడ్డికి దమ్ము, ధైర్యం ఉంటే ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేదంటే తప్పయిపోయిందని లెంపలేసుకుని గద్దె దిగిపోవాలని కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. ఇకపై బీజేపీపై ఇలాంటి అబద్ధాలు చెబితే తాను చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రిజర్వేషన్లు రద్దు చేయాలనే ఉద్దేశ్యం కాంగ్రెస్ కే ఉందన్నారు. కాంగ్రెస్ ఏం చేసుకున్నా తెలంగాణలో డబుల్ డిజిట్ స్థానాల్లో బీజేపీ గెలవడం ఖాయమని కిషన్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఎజెండాలో తాము పడదలుచుకోలేదని ఆయన తెలిపారు. ఇకపోతే రిజర్వేషన్ల అంశంపై మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలపై కిషన్ రెడ్డి స్పందించారు. రిజర్వేషన్లు సమర్థవంతంగా అమలు జరగాలని, అన్ని వర్గాలకు న్యాయం జరగాలని, దీన్ని పటిష్టంగా అమలుచేయాలనే ఆయన కోరారని, ఇందులో మరో ఉద్దేశ్యమేమీ లేదని కిషన్ రెడ్డి స్పష్టంచేశారు.

## ఎన్నికల్లో గెలుపుకు ఈడీ, సీబీఐని వాడుకోవడం మోడీకి అలవాటే

**మొదటి పేజీ తరువాయి**

ప్రతిరోజూ కుప్పలు తెప్పలుగా ఎడిటెడ్ వీడియోలు తిరుగుతుంటాయి. కానీ కాంగ్రెస్ పార్టీని ఎన్నికల వేళ ఇరుకున పెట్టేందుకే బీజేపీ ఇటువంటి కుట్రలకు పాల్పడుతోందని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. దేశవ్యాప్తంగా బీజేపీ గ్రాఫ్ పడిపోతుందన్న భయంతోనే ఇటువంటి చర్యలకు దిగుతున్నారని కాంగ్రెస్ నేతలు విమర్శిస్తున్నారు.
ఢిల్లీ పోలీసులు జారీ చేసిన నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని పీసీసీ నేతలు స్పష్టంచేశారు. నోటీసులు తీసుకున్నామని, వివరణ ఇస్తామని ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీకి ఇలాంటి మార్ఫింగ్ పనులు చేసే అవసరం లేదని, ఏ తప్పూ చేయదని అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ సీట్లకు దెబ్బపడుతుందన్న భయంతోనే ఢిల్లీ పోలీసులు నోటీసులు పట్టుకుని పరుగున వచ్చారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీలు, మైనారిటీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉందనే అక్కసుతోనే బీజేపీ ఇలాంటి కుట్రలకు పాల్పడుతుందని ఆయన ఆరోపించారు. తెలంగాణలో బీజేపీ పట్ల వ్యతిరేకత పెరుగుతోందని ఆయన అన్నారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు వస్తే అంబేద్కర్ రాజ్యాంగాన్ని తీసివేసి కొత్త రాజ్యాంగాన్ని తెచ్చే కుట్ర జరుగుతోందన్నారు.

## స్థానిక ఎన్నికలకు అధికారుల కసరత్తులు షురూ

**మొదటి పేజీ తరువాయి**

వర్గాలు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలవటం ద్వారా వచ్చిన జోష్, ప్రస్తుత లోక్సభ ఎలక్షన్లలో అత్యధిక సీట్లలో గెలుస్తామనే విశ్వాసం వెరసి అధికార పార్టీ, రాబోయే ఎన్నికలన్నింటిలో ఇదే హవాను కొనసాగించాలని భావిస్తోంది. తద్వారా కార్యకర్తలు, నాయకుల్లో నూతనోత్సాహాన్ని ప్రోది చేయటంతోపాటు కాంగ్రెస్కు మరిన్ని జవసత్వాలు వచ్చే విధంగా పరిస్థితిని తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ భావిస్తున్నారు. ఎన్నికలన్నీ వరసగా అయిపోతే ఆ తర్వాత పాలనపై పట్టు సాధించవచ్చంటూ ఆయన ఇటీవల తన సన్నిహితులతో చెప్పినట్టు సమాచారం. ఆ రకంగా ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి మాదిరిగా తాను కూడా హస్తం పార్టీలో ఒక పెద్ద లీడర్గా నిలవాలన్నది ఆయన వ్యూహంగా కనబడుతున్నది. ఈ క్రమంలోనే పంచాయతీ నుంచి పార్లమెంటు దాకా కాంగ్రెస్ ఆధిపత్యాన్ని కొనసాగించాలని ఆయన భావిస్తున్నారు. అందుకే లోక్సభ ఎన్నికలు కాగానే లోక్ల్ బాడీ ఎన్నికలను నిర్వహించాలంటూ సీఎం ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో పంచాయతీ పాలకవర్గాల కాలపరిమితి గత ఫిబ్రవరి ఒకటితో ముగిసింది. గ్రామాల్లో ఇప్పుడు ప్రత్యేకాధికారుల పాలన నడుస్తోంది. అంటే పాలకవర్గాలు లేక ఇప్పటికే మూణ్నెల్లు గడించిందన్నమాట. లోక్సభ ఎన్నికలు ముగిసి, ఫలితాలు రావాలంటే జూన్ మొదటి వారం వరకూ వేచి చూడాల్సిందే. ఆ రకంగా మరో రెండు నెలలు, మొత్తంగా ఐదు నెలలపాటు పాలకవర్గాలు లేకుండానే పంచాయతీలు కొనసాగనున్నాయి. ఎంపీటీసీలు, జడ్పీటీసీల కాలపరిమితి కూడా వచ్చే జూన్ మూడుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఎంపీ ఎన్నికలైన వెంటనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, ఈ విషయంలో ఎలాంటి ఆలస్యం చేయొద్దని సర్కారు ఆదేశించింది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం సంబంధిత కార్యచరణను చేపట్టిందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. బీఆర్ఎస్ హయాంలో తండాలను పంచాయతీలుగా మార్చారు. వాటితోపాటు కొన్ని శివారు ప్రాంతాలను కూడా పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో పాత వాటితోపాటు కొత్తవాటి జాబితా, ఓటర్లు, పోలింగ్ బూత్ల సంఖ్య తదితరాంశాలను తాజా పరచాలంటూ ఎన్నికల సంఘం జిల్లాల అధికారులకు సూచించినట్టు సమాచారం. మరోవైపు నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కూడా త్వరలోనే ఎన్నికల జరగనుంది. ఆ స్థానంలో బీఆర్ఎస్ నుంచి గెలుపొందిన పల్లా రాజేశ్వరరెడ్డి మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం విదితమే. అందువల్ల అక్కడ ఉప ఎన్నిక జరగబోతున్నది. ఇటు స్థానిక సమరం, అటు ఎమ్మెల్సీ సమరం ఈ రకంగా లోక్సభ ఎన్నికల తర్వాత కూడా రాష్ట్రంలో ఎలక్షన్ ఫీవర్ కొనసాగనున్నది.

## రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ

**అమిత్ షా డీప్ ఫేక్ వీడియో కేసులో రేవంత్‌కు సమన్లు**

తెలంగాణ బ్యూరో, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ చేశారు. కేంద్రమంత్రి అమిత్ షా డీప్ ఫేక్ వీడియో కేసులో భాగంగా సీఎం రేవంత్‌కు సమన్లు జారీ అయ్యాయి. మే 1వ తేదీన హాజరుకావాల్సిందిగా ఢిల్లీ పోలీసులు నోటీసుల్లో పేర్కొన్నారు. రిజర్వేషన్లు రద్దు చేస్తున్నారని అమిత్ షా పేరుతో ఓ ఫేక్ వీడియోను కాంగ్రెస్ పార్టీ వైరల్ చేసింది. ఫేక్ వీడియోపై కేంద్ర హెూం శాఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సెక్షన్ 153/153A/465/469/171G కింద ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు కేసు నమోదు చేశారు. డీప్ వీడియో షేర్ చేసినందుకుగాను పలువురు కాంగ్రెస్ నేతలకు ఢిల్లీ పోలీసులు సమన్లు జారీ చేశారు. ఇందులో సీఎం రేవంత్ ఒకరు. మరి ఢిల్లీ పోలీసులు ఇచ్చిన సమన్లపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ స్పందన ఎలా ఉండబోతుందో చూడాలి.

## సీఎస్ శాంతి కుమారి పేరుతో నాఖిలీ ఫోన్ కాల్

*సైబర్ క్రైం గా కేసు నమోదు*

హైదరాబాద్, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): తెలంగాణ చీఫ్ సెక్రటరీ శాంతి కుమారి సోమవారం సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్, సైబర్ సెక్యూరిటీ బ్యూరోకి ఫిర్యాదు చేశారు. తన పేరు, ప్రొఫైల్ ఫొటో ఉపయోగించి కొందరు ఇతరులకు ఫేక్ కాల్స్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు o977-984-4013103 మొబైల్ నంబర్ తో తన పేరుమీదుగా నకిలీ కాల్స్ చేస్తున్నారని సీఎస్ శాంతి కుమారి సైబర్ క్రైం కేసు నమోదు చేశారు. పోలీసులు ఈ ఫిర్యాదుతో ఎఫ్ఐఆర్ ఫైల్ చేశారు.

## మరోసారి ఆందోళనలకు దారితీసిన ఓయూ హాస్టల్స్ మూతివేత

**నీటి ఎద్దడి, కరెంటు కోత కారణంగా సెలవులు ప్రకటిస్తున్నట్లు నోటీసు జారీ**

హైదరాబాద్ ఓయూ, ఏప్రిల్ 29 (తీన్మార్ న్యూస్): చదవులు తల్లి, ఉద్యమాల గడ్డ ఉస్మానియా యూనివర్సిలో హాస్టల్స్ మూతివేత అంశం మరోసారి ఆందోళనలకు దారితీసింది. నీటి ఎద్దడి, కరెంటు కోత కారణంగా విద్యార్థులకు వేసవి సెలవులు ప్రకటిస్తున్నట్లు వార్డెన్ నోటీసు జారీ చేశారు. ఈ మే-రకు మే 14 నుంచి జూన్ 6 వరకూ మెస్, హాస్టల్ క్లోజ్ చేస్తున్నట్లు తెలిపారు. అయితే హాస్టల్ మూసివేతపై విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీస అవసరాలు కల్పించకుండా సెలవుల సాకుతో ఇంటికి పంపించడం దారుణమని వాపోతున్నారు. అంతేకాదు వెంటనే ఓయూ వీసి స్పందించి వసతులు ఏర్పాటు చేయాలని, లేదంటే ధర్నా చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఇదిలావుంటే.. గతేడాది సైతం ఇదే సమయంలో వేసవి సెలవుల పేరుతో మొదటిసారి నోటీసు రిలీజ్ చేశారు. కాగా మళ్లీ అదే సాకుతో హాస్టల్స్ క్లోజ్ చేస్తున్నట్లు నోటీసు జారీ చేయడం ఇది రెండోసారి కావడం విశేషం. కాగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు అర్ధరాత్రి నీళ్ళ కోసం ఆందోళనకు దిగారు. పేరుకే విశ్వవిద్యాలయం, విద్యార్దులకు కనీస వసతులు కూడా కలిపించట్లేదంటూ మండిపడ్డారు. మీ ఇంట్లో కూడా ఆడపిల్లలు ఉన్నారు. వాళ్ళకొక తీరు, ఉస్మానియా హాస్టల్లో ఉండే విద్యార్దులకు ఒక తీరా అని ప్రశ్నించారు. దీంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది.





తీన్మార్
తెలుగు దినపత్రిక

## ఊపుతగ్గిన బీజేపీ ఉన్మాద వ్యూహాలు

ప్రధానమంత్రి, బీజేపీ సర్వాధినేత నరేంద్రమోడీ ఇటీవల మాట్లాడే మాటలు ఆయన రాజ్యాంగ రీత్యా నిర్వహిస్తున్న బాధ్యతలకే గాక రాజకీయంగా ఆ పార్టీ పరిధిని కూడా మించిపోతున్నాయి. అసలు ఒక పార్టీగా గానీ ఒక ప్రభుత్వాధినేతగా గానీ ఆయన అవన్నీ మాట్లాడవలసిన అగత్యం లేకపోగా రాజ్యాంగం కనీసంగా తెలిసిన వారైనా జీర్ణించుకోలేని పరిస్థితి. నిజానికి మొదటి దశ పోలింగ్ సరళి మింగుడుపడకే మోడీ ఏదేదో మాట్లాడుతున్నారని దేశంలో రాజకీయ చర్చను ఎక్కడికో తీసుకు పోజూస్తున్నారని పరిశీలకులు, మీడియా వారు మొత్తంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయంలో బీజేపీ అనుకూలమైన వారు కూడా ఆశ్చర్యాన్ని దిగమింగి ఏదో విధంగా సమర్థించేందుకు తంటాలు పడుతున్నారు. రెండో విడత పోలింగ్ కూడా అందుకు పెద్ద భిన్నంగా లేదని సమాచారం. కాబట్టి మోడీ విద్దూర వాక్కులు విజృంభించడమే గానీ తగ్గుముఖం పట్టడం జరక్కపోవచ్చు. దీని ద్వారా ఆయన ఆశించే ప్రయోజనాలు రెండు: ఒకటి అలవాటైన మత రాజకీయాలను రగిలించడం,రెండోది తలాతోక లేని ఆరోపణలతో ప్రజలను అయోమయానికి గురిచేయడం. మొదట ఆయన రాజస్థాన్‌లోని బర్వాన్‌లో ప్రసంగించారు. కాంగ్రెస్ గెలిస్తే మీ ఆస్తిపాస్తులు తీసుకుని ముస్లింలకు ఇచ్చేస్తుందని భయపెట్టారు.(దానిపై మీడియాలో ఇప్పటికే పలు వ్యాఖ్యలు వచ్చాయి) అది కాస్త బెడిసికొట్టడంతో మొత్తం ఆస్తులకే ఎసరు పెడతారని కొత్తపాట అందుకున్నారు. ఇందుకు మద్దతుగా ఒకప్పటి ఆ పార్టీ సలహాదారు శ్యాంపిట్రోడా ఎప్పుడో చేసిన ఒక వ్యాఖ్యను తీసుకొచ్చారు. బాగా ధనాఢ్యులైన వారు ఆస్తిని వారసులకు అప్పగించి చనిపోతే వారి మరణానంతరం వారసత్వ పన్ను వేయొచ్చుననేది ఆయన ప్రస్తావించిన అంశం. అమెరికాలో 45శాతం, జపాన్‌లోనైతే ఏకంగా 55 శాతం వున్న ఈ పన్ను మొత్తాన్ని ఆస్తి విలువ నుంచి మినహాయించుకుని ఇవ్వాలనేది ఆ చట్టాల సారాంశం. భారత దేశంలో అలాంటి చట్టం లేదు గానీ ఆర్థిక సమానత్వం, సమాజ ప్రయోజనాల కోసం ఆస్తిని తీసుకోవడం వంటి అంశాలు రాజ్యాంగ ఆదేశిక సూత్రాల్లోని39(బి) పరిధిలోవి. దాని అమలుకు సంబంధించిందే 31(సి). యజమాని లేని ఆస్తులను లేదా అవసరమైన వాటిని తీసుకోవడానికి అవకాశమిస్తున్న మాట నిజం. ఇందుకు భిన్నంగా ప్రయివేటు ఆస్తికి 19వ అధికరణం రక్షణనిస్తుంది. ప్రపంచీకరణ, ప్రయివేటీకరణ యుగంలో ఇవన్నీ తెరవెనక్కు పోయిన మాట నిజమే గాని మౌలికంగా ఆ భావన తప్పు కాదు. రాజభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ వంటి సందర్భాలో ఈ రెంటికీ మధ్యనే చర్చ జరిగింది.

ఎందుకీ ప్రచారాలు?కోర్టులేమన్నాయి?

కమ్యూనిస్టు ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్నప్పుడు దాన్ని దెబ్బతీయడం కోసం ఆస్తులు లాగేసుకుంటారని పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి ప్రగతినిరోధక శక్తులు. ఇందిరాగాంధీ కాస్త భూసంస్కరణలంటూ హడావుడి చేసిన సమయంలోనూ వీరంతా ఇదే విధంగా గగ్గోలు పెట్టారు. వాస్తవానికి ఇప్పుడున్న అంతర్జాతీయ పరిస్థితిలో ప్రజల ఆస్తులు ప్రభుత్వాలే ప్రయివేటుపరం చేయడం పరిపాటిగా మారింది. మోడీ హయాంలోనే పెట్టుబడుల ఉపసంహరణ మంత్రంగా మారింది. ఇదే విశాఖ ఉక్కు వరకూ పాకింది. దానిపై ప్రజాందోళనకు కేంద్రం స్పందించడం లేదు కూడా. ఈ విధంగా ప్రభుత్వ ఆస్తులు ప్రయివేటుపరం చేయడంలో ముందున్న మోడీ వ్యక్తిగత ఆస్తులకేదో ముప్పు దాపురిస్తుందని భయపెట్టడం వంచనా శిల్పం మాత్రమే! హిందూ, ముస్లిం తేడా లేకుండా మిగిలిన వారిని కూడా హడలగొట్టడంలో ఆయన ఆలోచన ఏమిటో వేరే చెప్పనక్కరలేదు. ఆసక్తికరం ఏమంటే ఈ సమయంలోనే సిజెఐ చంద్రచూడ్ నాయకత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ సమస్య చేపట్టింది. ముంబాయి ప్రాపర్టీ ఓనర్స్ అసోసియేషన్ ఎప్పుడో వేసిన ఒక పిటిషన్‌ను దుమ్ముదులిపి తీసింది. ప్రజా ప్రయోజనాల కోసం ప్రయివేటు ఆస్తిని తీసుకోవడం ఆదేశిక సూత్రాల్లోని 39(బి) సారాంశం. ధర్మా సనంలోని జస్టిస్ నాగరత్న దీనిపై కీలక వ్యాఖ్యలే చేశారు. సరళీకరణ యుగంలో ప్రయివేటీకరణకు ఇది విరుద్ధం కదా అని అడిగారు. తాను మార్క్సిస్టుల తరహాలో ఆస్తి పంపిణీ గురించి చెప్పడం లేదనీ, అయితే ఈ అంశానికి ప్రాధాన్యత ఉంటుందని ఆయనన్నారు. దీనిపై ఇది చివరకు ఏ దిశలో పయనించేది ఓపిగ్గా వేచి చూడవలసిందే. కానీ మోడీ మాత్రం ఈ లోగానే ఏదో జరిగిపోతుందనీ అందరి ఆస్తిపోతుందని గగ్గోలు పెడు తున్నారు. శ్యాంపిట్రోడా ఇతర విడియోలు కూడా తవ్వితీస్తున్నారు. ఇంతా చేసి పిట్రోడా ఇప్పుడేమీ కాంగ్రెస్‌తో లేరు. అసలు క్రియాశీల రాజకీయవేత్తా కాదు. అయినా బీజేపీకి జనాన్ని కంగారుపెట్టే ఏదో అంశం కావాలి కదా.

సకలవర్గాల్లో ఆందోళన

ఆస్తికవాదమంతా తమదేనని మత రాజకీయాలు నడిపే బీజేపీ ఆస్తి విషయాలవైపు రావడం యాదృచ్ఛికమేమీ కాదు,అంతెందుకు? ముస్లింలకు ఆస్తి ఇస్తారంటూ మొదటిరోజు చెప్పిన మోడీ దానిపై విమర్శలు వచ్చాక కూడా మార్చుకోకపోగా హనుమాన్ జయంతి రోజున హనుమాన్ చాలీసా చదవనివ్వడం లేదని కొత్త ఆరోపణ చేశారు. ఇక్కడో విశేషం ఉంది. నరేంద్రమోడీని 'నమో' అంటుంటారు భక్తులు. నిజానికి నమో నమ:శివాయ అనేది శివభక్తులు వాడేది. కానీ కాశీలో పోటీచేసి గెలిచిన మోడీకే ఆ విశేషం తగిలించేశారు. అలాగే హనుమాన్ చాలీసా తరహాలో మోడీ చాలీసా కూడా రచించారు! ఆయన వ్యక్తి ఆరాధాన అంత ఎత్తుకు తీసుకుపోవడం సంఘ పరివార్ వ్యూహంలో భాగమే. అయితే రానురాను ఈ ప్రభ మసకబారిందని వారు గ్రహించక తప్పలేదు. మరే సమస్య లేనట్టు మోడీ పేరే ఊపేస్తుందన్న భావం కరిగిపోయింది. మతాన్ని రాజకీయాలను కలిపే పాత పాచికలూ పారడం లేదు. స్థానిక నాయకులెవరైనా జాతీయంగా మోడీ సరిపోతాడన్న ప్రచారం కర్నాటక నుంచి చాలా చోట్ల వీగిపోయింది. అనేక అంశాలలో కేంద్ర నిరంకుశత్వం వారి గడపలను తాకింది. ఈ సమయంలో మోడీ సభలకు చిట్కాలకు అసలు స్పందన తగ్గిపోతున్నది. వివిధ పార్టీల కీలక నాయకులను అసలు బీజేపీలోనే స్థానికంగా పట్టు కలిగిన నేతలను కూడా తోసిరాజన్న మోడీ ధోరణిని వారు ఆమోదించలేక పోతున్నారు. చాలా సర్వేలలో సంకేతాలు వచ్చినట్టు నిరుద్యోగం, ధరల పెరుగుదల, దారిద్ర్యం, వంటివి వారిని ఎంతగానో కలవరపరుస్తున్నాయి. వ్యవసాయ రంగానికి ఇచ్చిన హామీలు బుట్టదాఖలు చేశారు.

# మోడీ సభను విజయవంతం చేయండి

టేక్మాల్, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): ప్రధాని నరేంద్రమోడీ అల్లాదుర్గ్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు. టేక్మాల్ మండల బిజెపీ అధ్యక్షులు నవీన్ గుప్తా భారతీయ జనతా పార్టీ మండల కార్యాలయం లో సోమవారం రోజు టేక్మాల్ లో జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతీయ జనతా పార్టీ - నరేంద్రమోడీ సమర్థవంతమైన పాలనను ప్రజలందరికి తెలిసేలా గత నెల రోజులుగా గడప గడపకు బీజేపీ నినాదాలతో మనం అలుపెరగకుండా అనేక రకాల పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాము, అదే స్ఫూర్తి తో అదే ఉత్సాహంతో ప్రజలను అభిమానులను ఏకం చేస్తూ అత్యధిక సంఖ్యలో జనసమీకరణ చేయాలన్నారు. అల్లాదుర్గ్ లో జరిగే బహిరంగ సభకు ఐదు లక్షల మంది జనసమీకరణ వైపు అడుగులేస్తున్నారన్నారు. టేక్మాల్ మండల కేంద్రం ఆయా గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో ప్రజలు కార్యకర్తలు పాల్గొని సభను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో




టేక్మాల్ మండల ఇన్చార్జ్ జగదీష్ పాటిల్, మండల ప్రధాన కార్యదర్శి కుమ్మరి సిద్ధిరాములు, ఉపాధ్యక్షులు వడ్డె రాములు, గిరిజన మోర్చా అధ్యక్షులు సేనాపతి, యువమోర్చా అధ్యక్షులు పవన్, టేక్మాల్ పట్టణ అధ్యక్షులు దొడ్ల నాగరాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

# దేవరకద్ర ప్రచార హోరు చేరికల జోరు

- పార్లమెంట్ 14 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం
- కార్యకర్తలే పార్టీకి పునాదిరాళ్లు
- సమయం లేదు ప్రచారంలో స్పీడ్ పెంచాలి
- కష్టపడ్డ వాళ్లకి తప్పక గుర్తింపు ఉంటుంది
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

దేవరకద్ర ప్రతినిధి, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): కార్యకర్తలే పార్టీకి పునాదిరాళ్లు కష్టపడి పని చేస్తేనే మన లక్ష్యాన్ని చేరుకుంటాం పార్లమెంట్, ఎన్నికలలో ప్రతి ఒక్క కార్యకర్త నాయకుడు కష్టపడి పని చేయాలి కష్టపడ్డ వాళ్లకి తప్పక వారికి గుర్తింపు ఉంటుందనీ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై పార్టీ కార్యాలయాన్ని





ప్రారంభించిన దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి, అనంతరం మదనాపురం మండలం దుప్పల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు మాజీ ఎంపీటీసీ మాసన్న పలువురు నాయకులు, కార్యకర్తలు, దేవరకద్ర మండలం అడివి అజలాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీ తిరుమలయ్య మరియు పలువురు మాజీ వార్డ్ మెంబెర్స్, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జియంఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో 14 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన సంక్షేమ పథకాలన్నీ కూడా తప్పకుండా అమలు చేస్తామని తెలిపారు. ఆశీర్వదించండి పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించండి అని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండ ఎంపీ అభ్యర్థి రఘువీర్ రెడ్డి అధిక మెజార్టీతో గెలుపుకి కృషి చేస్తాం

- వికలాంగుల సంక్షేమ చైర్మన్ ముత్తినేని వీరయ్య

నేరేడుచర్ల, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): నల్లగొండ పార్లమెంట్ లోని 80 వేల మంది పెరిక కులస్తులు, 3లక్షల మందికి పైనా ఉన్న వికలాంగులు, వితంతువులు, వృద్దులు, ఫించన్ దారుల మద్దతు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘు వీర్ రెడ్డి కే ముత్తినేని వీరయ్య పెరిక కుల కార్పొరేషన్ సాధకులు, రాష్ట్ర చైర్మన్ కాంగ్రెస్ పార్టీ వికలాంగుల విభాగం & ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ వికలాంగుల సంక్షేమం హుజూర్ నగర్ నియోజక వర్గం లో కి రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న విజయ సంకల్ప యాత్ర -2( వికలాంగులు వితంతువులు వృద్దులు, ఫించన్ దారులు, పెరిక కులస్తుల సంక్షేమం పై & ఓట్ల పై)కి దొంగరి వేంకటేశ్వర్లు, నేరేడు చర్ల పట్టణ అధ్యక్షుడు కీత భద్రయ్య, హుజూర్ నగర్ నియోజక వర్గం లో నీ అన్నీ మండలాల పెరిక(పురగిరి క్షత్రియ) కుల సంఘం ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు అనంతరం ఎస్ కే ఎస్ పంక్షన్ హాల్ లో సభ నిర్వహణ చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్, పెరిక కుల కార్పొరేషన్ సాధకులు ముత్తినేని వీరయ్య హాజరై ప్రసంగించారు. వారు మాట్లాడుతూ పెరిక కులస్తుల దశాబ్దాల కలని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే కులానికి కార్పొరేషన్‌ఏర్పాటు చేసి కాంగ్రెస్ ప్రభుత్వం పేరికలకి అత్మ బందువు అయిందని అన్నారు బిజెపి, బిఆర్ఎస్ లకి కార్పొరేషన్ ఏర్పాటు చేయమని వినతి పత్రాలు ఇచ్చిన గడ్డి పోస లెక్క తీసిపారేశారన్నారు.





కానీ కాంగ్రెస్ గుర్తించి మేనిపేస్టోలో పెట్టీ ప్రభుత్వం ఏర్పడగానే క్యాబినేట్ ఆమోదించి కార్పొరేషన్ నీ ఏర్పరిచిన కాంగ్రెస్ పార్టీ రుణం తీర్చుకునే సమయం పెరికలకి వచ్చింది అన్నారు. ఎక్కడ చూసినా పెరిక కులస్తులు మా యాత్రకి మద్దతు తెలిపి కాంగ్రెస్ కి ఓటేస్తాము అనడం సంతోష కరమైన విషయం అన్నారు. నల్లగొండ పార్లమెంట్ లో ఉన్న పెరిక కులస్తులు దాదాపు 80 వేల ఓట్లు,వికలాంగులు, వితంతువులు, వృద్దులు, ఫించన్ దారుల 3లక్షల ఓట్లు కాంగ్రెస్ కీ మద్దతు తెలిపి కుందూరు రఘు వీర్ రెడ్డి కి అత్యధిక మెజారిటీ ఇవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమం లో హుజూర్ నగర్ నియోజక వర్గం పిసిసి మెంబర్, పెరిక కుల సీనియర్ నాయకులు దొంగరి వేంకటేశ్వర్లు, విజయసంకల్ప యాత్ర హుజూర్ నగర్ నియోజకవర్గ ఇన్చార్జి ఎంపీటీసీ ల ఫోరమ్ జిల్లా కార్యదర్శి మీసాల ఉపేందర్, నేరేడుచర్ల పట్టణపెరిక కుల అద్యక్షుడు కిత భద్రయ్య, పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి అసోసియేట్ అద్యక్షుడు కోట మల్లికార్జున్ రావ్, పట్టణ కుల ప్రధాన కార్యదర్శి జనార్ధన్, వైస్ ఎంపీపీ పిన్నెల్లి ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు కటికం లక్ష్మి నారాయణ, కోశాధికారి వనపర్తి శ్రీనివాస్, పట్టణ గౌరవాధ్యక్షులు బొలిషెట్టి లక్ష్మీ నారాయణ, ప్రచార కార్యదర్శి దొంగరి వెంకన్న హుజూర్ నగర్ పట్టణ అధ్యక్షుడు కితా సుధాకర్, యువజన సమన్వయ కర్త బాల్యారి సతీష్, హుజూర్ నగర్ నియోజక వర్గం కుల యువజన అధ్యక్షుడు పిన్నని సంపత్, ఎంపీటీసీ బాల్యారి సందీప్, తో పాటు హుజూర్ నగర్ నియోజక వర్గం లో నీ వివిధ గ్రామాల పెరిక కుల ముఖ్య నాయకులు 257 మంది పాల్గొన్నారు.

# పోలీసుల తనిఖీలో భారీగా నగదు స్వాధీనం

- రూ.250000/- నగదు పట్టుబడిన వ్యక్తి
- ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో నల్లగొండ డిటిఓ లో డిపాజిట్ చేసిన పోలీసులు

రామన్నపేట, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): మండల కేంద్రంలోనీ సిరిపురం క్రాస్ రోడ్ దగ్గర ఎన్నికల నియమావళి అమలులో భాగంగా సోమవారం నాడు రామన్నపేట పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. తనిఖీల్లో భాగంగా రామన్నపేట నుండి వలిగొండ వైపు బైక్ పై వెళ్తున్న మహేష్ (35) అనే వ్యక్తి అపి తనిఖీ చేయగా అతని దగ్గర రూ.250000/- నగదు ఉన్నట్టు గుర్తించారు. అతను ఆ నగదు కి సంబందించి ఎటువంటి ఆధారాలు చూపించకపోవడంతో ఆ డబ్బును పోలీసులు స్వాధీనం చేసుకుని, నల్లగొండ డిటిఓ లో డిపాజిట్ చేసినట్టు ఎస్ఐ పి.మల్లయ్య తెలిపారు.




తనిఖీ నిర్వహిస్తున్న పోలీసులు

# వాహన తనిఖీల్లో ఒక లక్ష నగదు సీజ్






- ఎంపి బిబి పాటిల్ కుమారుడు అభినవ్ పాటిల్

టేక్మాల్, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో టేక్మాల్ మండల పరిధిలోని బొడ్మట్ పల్లి వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా జహీరాబాద్ ఎంపి అభ్యర్థి బిబి పాటిల్ కుమారుడు అభినవ్ పాటిల్ అనే వ్యక్తి తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా ఉన్న ఒక లక్ష నగదును స్వాధీనం చేసుకున్నట్లు టేక్మాల్ ఎస్ఐ మురళి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఎన్నిక నియమావళి అమల్లో ఉన్నదని, 50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్తే సంబంధిత పత్రాలు దగ్గర ఉంచుకోవాలని తెలిపారు. ఏఎస్సై తుక్కయ్య సిబ్బంది ఉన్నారు.

# ఇంటర్మీడియట్ విద్యార్థులకు సూచన

టెక్మాల్, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): ఇంటర్మీడియట్ సప్లమెంటరీ పరీక్షలను మే 24 నుండి జరుపబడును కావున ప్రథమ మరియు ద్వితీయ సంవత్సర విద్యార్థులు ఫెయిల్ అయిన విద్యార్థులు మరియు ఇంప్రూవ్మెంట్ పరీక్షలు రాసే విద్యార్థులు మే 2వ తేదీ లోపు ఫీజు చెల్లించి పరీక్షకు హాజరు కావాలని టేక్మాల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుభాష్ చంద్ర తెలిపారు. ఈ ఫీజు తేదీని మళ్లీ పెంచడం గాని ఫైన్ తో పెంచడం గాని ఉండదని ఇట్టి విషయాన్ని విద్యార్థులు గమనించగలరని తెలిపారు.

# మణిగిల్లలో పుట్టుచీర, పుట్టు పంచె కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మేఘారెడ్డి దంపతులు.



వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండలం, మణిగిల్ల గ్రామ ప్రస్తుత మాజీ సర్పంచ్ మేరెడ్డి సరిత-తిరుపతి రెడ్డిల కుమార్తె శ్రీహితారెడ్డి, పుట్టు చీర, కుమారుడు నిక్షిత్ రెడ్డి పుట్టు పంచె కార్యక్రమానికి ఆదివారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘరెడ్డి-శారదా రెడ్డి దంపతులు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారుల తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే దంపతులతో ఫోటోలు దిగుతు కాసేపు సందడి చేశారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణం, పెద్దమందడి, ఖిల్లా ఘనపురం, పెబ్బేరు, గోపాల్ పేట, కొత్తకోట మండలాల కాంగ్రెస్ పార్టీ ముఖ్య ముఖ్య నాయకులు, పెద్దలు, పార్టీ శ్రేణులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇట్టి కార్యక్రమానికి విచ్చేసిన బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు, స్నేహితులకు, ధన్యవాదాలు తెలిపారు.

# ఆర్టీసీ సిబ్బంది పై దాడి చేస్తే కేసులే

హైదరాబాద్, ఏప్రిల్ 29: తమ సిబ్బంది బాగోగులపై టీఎస్ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ దృష్టి సారించారు. ఇటీవల ఆర్టీసీ సిబ్బందిపై వరుస దాడులు జరగడంతో సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. ఎవరైనా తమ సిబ్బందిపై దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని, పలు ఘటనల్లో పదే పదే స్పష్టం చేశారు. ప్రజల కోసం సేవ చేస్తున్న టీఎస్ ఆర్టీసీ సిబ్బందిపై దాడి ఘటనలో బాధ్యులకు జైలుశిక్షతో జరిమానా విధిస్తామని సజ్జనార్ స్పష్టం చేశారు. నిబద్ధత, అంకితభావంతో పని చేస్తున్న సిబ్బందిపై దాడులు చేయడం క్షమించరాని నేరం అన్నారు. తమ సిబ్బందిపై కొందరు అకతాయిలు, ఉద్దేశపూర్వకంగా జరుగుతున్న దాడులను సంస్థ యాజమాన్యం ఏమాత్రం సహించదని సజ్జనార్ స్పష్టం చేశారు. టీఎస్ ఆర్టీసీ సిబ్బందిపై దాడి ఘటనలో బాధ్యులను గుర్తిస్తే.. వారిపై ఐపీసీ 353 సెక్షన్ ప్రకారం 2 సంవత్సరాల వరకు జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇందుకోసం పోలీస్ శాఖ సహకారం తీసుకుంటాం అన్నారు.దాడులకు పాల్పడుతున్న వారిపై హిస్టరీ షీట్స్ కూడా తెరుస్తామని హెచ్చరించారు. దాడులు జరిగిన సమయంలో జరిగే బస్సు డ్యామేజీ ఖర్చులను సైతం నిందితుల నుంచి వసూలు చేస్తామని స్పష్టం చేశారు.

# బీజేపీ ఎన్ని ఎత్తులు జిత్తులు వేసినా జనం నమ్మరు

**- ప్రతి ఒక్క కార్యకర్త సైనికుల్లా పని చేయాలి**
**- కష్టపడినే గల్లీ నుంచి ఢిల్లీ వరకు అధికారం పక్క..!?**
**- కాంగ్రెస్ గ్యారెంటీలతో పేదలకు ఎంతో మేలు**
**- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి**



దేవరకద్ర ప్రతినిధి, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): బీజేపీ ఎన్ని ఎత్తులు జిత్తులు వేసినా జనం నమ్మరాదన్నారని, పార్లమెంట్ ఎన్నికల్లో గల్లీ నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్ పార్టీ అధికారం రావడం పక్క అన్ని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గ్యారెంటీలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం కేంద్రంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వస్తేనే బడుగు బలహీన వర్గాల ప్రజల బ్రతుకులు బాగుపడతాయని తెలిపారు. ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త బూత్ స్థాయిలో కష్టపడి పార్టీని గల్లీ నుంచి ఢిల్లీ వరకు మళ్ళీ అధికారంలోకి తీసుకురావాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీ చంద్ రెడ్డి ని గెలిపించుకునేందుకు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికుల్లా పని చేయాలని కోరారు. గ్యారెంటీలే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు శ్రీరామ రక్షగా పని చేస్తాయన్నారు. మోదీ కేసీఆర్ గాలి పాలమూరులో పని చేయదనే విషయాన్ని ఇంటింటా ప్రచారం చేయాలన్నారు.

# కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి గెలుపు ఖాయం





**- రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి**

ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి విజయం ఖాయమని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం రోజున భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి విజయమే లక్ష్యంగా మంచాల మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చిత్తపూర్, లింగంపల్లి, ఆగపల్లి గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొంగర విష్ణు వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పదిసంవత్సరాలు అధికారంలో ఉన్న బారాస కెసిఆర్ నియంత్రుత్వ పాలనకు చమర గీతం పాడి పామహౌజ్ కు పంపిన ప్రజలు ఆదాని, అంబానీలకు, కార్పొరేటర్, సంస్థలకు దేశసంపదను దోచిపెట్టి నమోడీ పెట్రోల్, డీజీల్ ధరలు, గ్యాస్ ధరలు జీఎస్టి పేరుతో లక్షలాది మంది చిరు వ్యాపారుల నోట్లమట్టికొట్టి నిరుపేదల, ఉ సురుపోసుకున్న మోడీ కి తగిన గుణపాఠం చెప్పేరోజు దగ్గర్లో ఉ ందని అన్నారు. బీజేపీ, బిఆర్ఎస్ కులం పేరుతో, మతం పేరుతో, ప్రాంతం పేరుతో, దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టి పబ్బంగడుపు కోవాలని చూస్తున్నారని దుయ్యాబట్టారు. తెలంగాణ ప్రజలు మేధావులని, త్వరలో మోడీ ప్రభూత్వాన్ని బొందపెట్టి ఢిల్లీ కోటపై మువ్వన్నెల జెండా ఎగురావేస్తామని ధీమా వ్యక్తం చేశారు. భారతదేశం అంటేనే ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్యదేశం విభిన్న, మతాలు, విభిన్న కులాలు విభిన్న సంస్కృతుల నిలయం అన్నారు. రాహుల్ గాంధిని ప్రధానమంత్రిని చేయడమే మా లక్ష్యం అన్నారు. ఈ యొక్క కార్యక్రమం లో మండల అధ్యక్షులు వింజమూరి రాంరెడ్డి, ఆరుట్ల ఎంపీటీసీలు కావలి శ్రీవాస్, రాందాస్ నాయక్, పాక్స్ డైరెక్టర్ వెదిరే హన్మంత్ రెడ్డి, శ్రీధర్ నాయక్, కోపషన్ సభ్యులు వాజిద్, గుండమోని మల్లేష్,మోతీరాం నాయక్, మిద్దె శ్రీనివాస్ గౌడ్, దాసు గౌడ్, జిలమోని పాండు, మాజి సర్పంచ్ రమాకాంత్ రెడ్డి, జైపాల్ రెడ్డి చేతాల సంజీవ, లింగం గౌడ్ సుమన్, రామకృష్ణ, సత్తయ్య, నూతనగంటి సదానందం, చీమల జంగయ్య యాదవ్, ప్రేమాకర్ రెడ్డి, భరత్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, సీనియర్ నాయకులు ఏర్పుల సంజీవ, బద్దుల బాలయ్య యాదవ్, బాలశివుడు గౌడ్, మండల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, మండల్ యూత్ అధ్యక్షులు ఏర్పుల సురేష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు లక్కుమాళ్ళ కల్పన, దూసరి లావణ్య, మొరం నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి నియోజకవర్గంలో పారదర్శకంగా నిష్పక్షపాతంగా ఎన్నికలు జరగాలి

**- ఎన్నికల పరిశీలకులు అమోఘ్ జీవన్ గాంకర్ ఐపీఎస్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): సోమవారం మధ్యాహ్నం వనపర్తి టౌన్ నందు గల సమస్య ఆత్మక పోలింగ్ స్టేషన్లను, చేక్ పోస్టు లను సందర్శించిన ఎన్నికల పరిశీలకులు పోలీస్ అబ్జర్వర్ అమెఘ్ జీవన్ గాంకర్ ఐ.పి.ఎస్ (డి ఐ జీ) మాట్లాడుతూ పోలింగ్ శాతం పెరిగే విధంగా ఓటరు నిర్భయంగా వచ్చి తన ఓటు తనకు నచ్చిన వ్యక్తికీ ఓటు వేసుకునే విధంగా కృషి చేయాలని అదేవిధంగా ప్రతి ఒక్క పోలింగ్ బూత్ దగ్గర ప్రతిష్ట భద్రత ఏర్పాట్లు చేయాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, పోలింగ్ బూత్ కు 100 మీటర్ల అవతలని వాహనాలను ఆపే విధంగా పార్కింగ్ ఏర్పాటు చేయాలని, వికలాంగులను లైన్లో కాకుండా నేరుగా బూతులోకి వెళ్లే విధంగా చూడాలని తెలిపారు. నవంబర్ 11 తారీకు ఐదు గంటల తరువాత ఎలాంటి పార్టీలకు చెందినవారు ప్రచారం చేయరాదు అని అలాగే తనిఖీలు కూడా ముమ్మరం చేయాలని, పోలీస్ సిబ్బందికి అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలి. కేంద్ర ఎన్నికల నియంత్రణలో పోలీస్ యంత్రాగం క్రమశిక్షణతో పనిచేయాలని సుహృద్భావ వాతావరణంలో నిష్పక్షపాతంగా శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలని జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి, ఐపిఎస్ నీ ఆదేశించారు. అనంతరం జిల్లా ఎస్పీ రక్షిత కె మూర్తి, ఐపిఎస్ మాట్లాడుతూ ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణలో ఎన్నికల నిబంధనలు అమలు చేస్తూ జిల్లాలో పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయడం జరుగుతుందని తెలియజేశారు.

వనపర్తి జిల్లాకు వచ్చిన పోలీస్ అబ్జర్వర్ వెంట వనపర్తి డిఎస్పి జే. వెంకటేశ్వరరావు, వనపర్తి సిఐ నాగభూషణం, టౌన్ ఎస్సై జయన్న, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# బిజెపి అభ్యర్థి భరత్ ప్రసాద్ ను గెలిపించండి

**పెబ్బేరు రూరల్ మాజీ మండల బిజెపి అధ్యక్షుడు భగవంతు యాదవ్**



పెబ్బేరు. ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): పెబ్బేరు మండలం, కొత్త సుగురు గ్రామంలో బూత్ నెంబర్ 215 భూతు అధ్యక్షుడు నరేష్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ బలపరిచిన నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి భరత్ ప్రసాద్ ను కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి ప్రచారం లో భాగంగా గ్రామ ప్రజలను కోరారు. ఈ సందర్భంగా పెబ్బేర్ రూరల్ మాజీ మండల అధ్యక్షుడు శక్తి కేంద్ర ఇన్చార్జి భగవంతు యాదవ్ మాట్లాడుతూ

గ్రామ ప్రజలు భారతదేశంలో 500 సంవత్సరాల అయోధ్యలో రామ మందిరం నిర్మాణం చేయడం 150 కోట్ల భారత ప్రజల కల నెరవేరిందని ప్రచారంలో ప్రజల నుంచి మంచి స్పందన వస్తుందని కరోనా టైంలో భారతదేశాన్ని ఆరోగ్య భారత దేశముగా ప్రత్యేక శ్రద్ధతో కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోడీ ఈ దేశాన్ని కరోనా మహమ్మారి నుండి కాపాడారని ప్రజలు విశ్వసిస్తున్నారు. తప్పకుండా భారత ప్రధానిగా నరేంద్ర మోడీని గెలిపించుకుంటామని ప్రజలు కోరుతున్నారు. దేశంలో నిరుపేదలకు ఉచితరేషన్ బియ్యం పంపిణీ చేస్తున్నారని తప్పకుండా భారతీయ జనతా పార్టీకి కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి భరత్ ప్రసాద్ ను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో 215 బూతు లోబిజెపి కార్యకర్తలు మహేందర్, వంశీ, కేజీ ఈశ్వర్, సాయి, కె. ఈశ్వర్, హరీష్, వెంకటేష్, వంశీ, శివ సాయి, శంకరయ్య, లోకేష్, గురు ప్రసాద్, మహేష్, ప్రవీణ్, భాస్కర్, చందు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ కార్మికులారా ఏకంకండి

**- కార్మికులకు పిలుపునిచ్చిన సమయాన, గంజి, బజారు హమాలీలు**
**- ఐక్యవేదిక మరియు అఖిలపక్షానికి అభ్యర్థన**
**- అభ్యర్థన మేరకు వెళ్లిన అఖిలపక్షం**
**- నిలువ నీడలేని హమాలీలకు రక్షణ కల్పించండి**
**- జిల్లా కలెక్టర్ మరియు ఎమ్మెల్యేకు అఖిలపక్ష ఐక్యవేదిక విజ్ఞప్తి**



వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): వనపర్తి బస్ డిపో పక్కల గంజి పరిధిలోని బజారు హమాలీలు దాదాపు నూట ఇరవై మంది ఉదయం నుండి సాయంత్రం వరకు రోడ్డు పై నుండి గంజి లోపల వరకు నిలబడే ఉంటున్నారు. వారికి గతంలో టౌన్ హాల్ వెనకాల ఒక షెడ్ ఉండేది కానీ అక్కడ ఉన్న వ్యాపారులు మార్కెట్ యార్డ్ సెక్రెటరీ తో కంప్లైంట్ చేయడం వలన వారికి ఆ షెడ్డు తీసివేసి నిలువ నీడ లేకుండా చేశారు. అక్కడే దడవాయులకు ఒక షెడ్డు ఏర్పాటు చేశారు. నూతన మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయడం వలన ఇక్కడి నుండి అక్కడ వారికి కొత్త రూమ్ ఏర్పాటు చేయడం వలన ఇక్కడ ఉన్న షెడ్డు ఖాళీగా ఉన్నది. దాని పక్కల స్థలంలో ఈ హమాలీలకు షెడ్ వేసుకోవడానికి అనుమతి ఇవ్వాలని వారికి తినడానికి గాని కూర్చోవడానికి స్థలం ఏర్పడుతుందని ఈ సందర్భంగా ఐక్యవేదిక జిల్లా కలెక్టర్ గారికి ఎమ్మెల్యే కి విజ్ఞప్తి చేస్తుంది.

ఎల్లుండి జరిగే మేడే ఉత్సవాలను అక్కడే జరుపుకుంటామని కార్మికులు, హమాలీలు ఐక్యవేదిక విజ్ఞప్తి చేసుకుంటుంది.

ఈ కార్యక్రమంలో హమాలీలతో పాటు ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్, సిపిఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, టిడిపి రాష్ట్ర నాయకులు కొత్త గొల్ల శంకర్, శివకుమార్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# పేద ముస్లిం మైనార్టీ అమ్మాయి ఒకేషనల్ లో 1000/960 మార్కులు

**- సాధించి వనపర్తికి గర్వకారణమైన సానియాకు అభినందనలు తెలిపి ఘనంగా సన్మానించిన అఖిలపక్ష ఐక్యవేదిక**



వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): సోమవారం ఉదయం చిట్యాల రోడ్డులోని డబుల్ బెడ్రూంలో నివసించే పత్రిక విలేకరి మహమ్మద్ నిరంజన్ కూతురైన సానియా ఇంటర్ ఒకేషనల్ లో 960 మార్కులు సాధించిన నేపథ్యంలో అఖిలపక్ష ఐక్యవేదిక ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్, సిపిఐ జిల్లా నాయకులు గోపాలకృష్ణ, టౌన్ కార్యదర్శి రమేష్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఉమా, టిడిపి నాయకులు కొత్త గొల్ల శంకర్, చత్రూ నాయక్, శివకుమార్, రాములు తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వనపర్తి లో నిరుపేద కుటుంబంలో పుట్టిన విద్యార్థినీ, విద్యార్థులు చాలామంది ఉన్నారని, వారు తెచ్చుకున్న మార్కులు వారి కుటుంబానికి కాక వనపర్తికి కూడా గర్వకారణమని అన్నారు. అందరినీ సకాలంలో సన్మానిస్తామని, ఇది మా బాధ్యత అని ఐక్యవేదికతో పాటు పలు పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. అంతేగాక మంచి మార్కులు తెచ్చుకున్న ప్రతి విద్యార్థికి, విద్యార్థినికి ఇవే మా హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ జి.చిన్నారెడ్డి, ఆదిత్య రెడ్డి



వనపర్తి నియోజకవర్గం ప్రతినిధి, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చవ్వ పెంటన్న యాదవ్ %ఉ% వెంకటమ్మ గారి ఆహ్వానం మేరకు, వనపర్తి లో ఆదివారం రోజు, వారి నూతన గృహప్రవేశానికి మరియు, మనవళ్లు ఆర్యన్. ఆయన్ పుట్టు పంచ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉ పాధ్యక్షులు డాక్టర్ జిల్లెల.చిన్నారెడ్డి మరియు ఆదిత్య రెడ్డిలు హాజరయ్యారు. సి.పెంటన్న యాదవ్ కుటుంబ సభ్యులతో మాట్లాడి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్యన్ అయాన్ లను దీవించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేందర్ ప్రసాద్ యాదవ్, వనపర్తి జిల్లా పార్లమెంటు ఎన్నికల అబ్జర్వర్ డి.హంసు వర్మ, జిల్లా మృత్యుకార సంఘ అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, వనపర్తి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొంకి వెంకటేష్, పెద్దమందడి సింగల్ విండో డైరెక్టర్ పి.



విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ సింగల్ విండో డైరెక్టర్ ఐ.సత్యరెడ్డి, వనపర్తి పట్టణ మాజీ అధ్యక్షుడు లాయర్ కిరణ్, లాయర్ చెవ్వ మోహన్ యాదవ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి గట్టు మన్యం, పెద్దమందడి బిసి సెల్ అధ్యక్షుడు రఘు, పెద్దమందడి ఎస్సీ సెల్ అధ్యక్షుడు గట్టు దయాకర్, పెద్దమందడి సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, సీనియర్ నాయకులు రాములు, అంజిరెడ్డి, గట్టు ధనంజయ్, రాములు యాదవ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెద్దమందడి రిపోర్టర్స్ వెంకట్ గౌడ్, ఎస్.అశోక్ కుమార్, బండి రాజు, బాజా శేఖర్, పురుషోత్తం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన గృహప్రవేశానికి వచ్చిన, బందు మిత్రులు, స్నేహితులు, శ్రేయోభిలాషులకు, అతిథులందరికీ పేరుపేరునా సి.పెంటన యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

# జిల్లా కేంద్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

**- కల్తీ జరిగితే చర్యలు తప్పవు**



భువనగిరి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): భువనగిరి పట్టణం లోని రహదారి లో ఉన్న పలు హెూటల్స్ పై ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ డాక్టర్ ఎం సుమన్ కళ్యాణ్ మరియు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి లు ఆకస్మికంగా దాడులు జరిపారు. హెూటల్స్ అపరిశుభ్రత గమనించి శుభ్రంగా ఉంచాలని లేనిచో చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వారి దగ్గర నుంచి శాంపిల్స్ సేకరించి హైదరాబాదులోని టెస్టింగ్ ల్యాబ్ కు



పంపించారు.

సేకరించిన ఆహార శాంపుల్స్ కల్తీ అని తేలినట్లయితే దాని ఆధారంగా చట్టపరమైన చర్యలు ఉంటాయని ఈ మధ్యకాలంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవిన్యూ ) పి.బెన్ షాలోమ్ గారు సుమారుగా 10 హెూటల్స్ లో మేము సేకరించి న ఫుడ్ శాంపిల్స్ సబ్ స్టాండర్డ్ అని తేలగ రూపాయలు 2,50,000 వరకు జరిమానా విధించడం జరిగిందని, ప్రజలకు అందించే ఆహారపదార్థాలు కల్తీ లేకుండా ఆరోగ్యకరంగా ఉండాలని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్స్ హెచ్చరించారు.

# అభ్యర్థులు ఎన్నికల ఖర్చులు తప్పనిసరిగా నమోదు చేయాలి

**- జిల్లా కలెక్టర్ హనుమంతు కే. జెండగే**





భువనగిరి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చును తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టరు హనుమంతు కే.జెండగే తెలిపారు. సోమవారం నాడు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల జనరల్ అబ్జర్వర్ రాబర్ట్ సింగ్ క్షేత్రమయుమ్, ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేశ్ రంజన్, సాయన్ దేబర్మ సమక్షములో ఎన్నికల బరిలో నిలిచిన 39 అభ్యరులు, వారి ప్రతినిధులకు జిల్లా కలెక్టరు ఎన్నికల వ్యయం పైన వివరించారు. భువనగిరి పార్లమెంట్ లోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించి ఎన్నికలలో రేట్ కార్డు ప్రకారం అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చును తప్పనిసరిగా మూడు రిజిష్టర్లలో ప్రతి రోజూ వ్యయ ఖర్చులు, క్యాష్ వివరాలు, బ్యాంక్ ట్రాన్సాక్షన్స్ నమోదు చేయాలని తెలిపారు. ఎన్నికల సమయంలో మొత్తం మూడు సార్లు అభ్యర్థి లేదా అతను సూచించిన ప్రతినిధి ద్వారా ఎన్నికల ఖర్చు వివరాలు అందించాలని, ఒక వేళ అందించినట్లయితే 1951 యాక్ట్ సెక్షన్ 10-ఏ క్రింద మూడు సంవత్సరాలు పోటీ చేయడానికి అర్హత కోల్పోతారని తెలిపారు. ప్రతి ఒక్క అభ్యర్థి 95 లక్షల వరకు ఖర్చు చేయవచ్చునని, ఎన్నికలు అయిన తర్వాత రిటర్నింగ్ అధికారి వద్ద ఎన్నికల ఖర్చు ఫైనల్ రీకన్సిలేషన్ చేసుకోవాలని తెలిపారు. సువిధ ద్వారా ర్యాలీలు, సమావేశాలు, సభలకు సంబంధిత అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వద్ద నుండి అనుమతులు పొందవచ్చునని, తేదీ సమయం స్పష్టంగా తెలియచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టరు పి.బెన్ షాలోమ్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టరు కె.గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవాలి





వనపర్తి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): శాంతిభద్రతల పరిరక్షణ లో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ చిత్తశుద్ధితో పనిచేస్తుందని బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా రక్షిత కె మూర్తి, ఐపిఎస్ అన్నారు. సోమవారం వనపర్తి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పి రక్షిత కె మూర్తి, ఐపీఎస్ ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేశారు.
జిల్లా నలుమూలల నుండి మొత్తం 04 ఫిర్యాదులు వచ్చినట్లు
పరస్పర గొడవలు 02,
భార్య భర్తల ఫిర్యాదులు 02,
ఉన్నాయనిపిఆర్వో రాంచందర్ రావ్ తెలియచేశారు.

# ఢిల్లీ-ఆగ్రా జాతీయ రహదారిపై ప్లాస్టిక్ పైపుల గోదాంలో భారీ అగ్నిప్రమాదం..

హైదరాబాద్ : ప్లాస్టిక్ పైపుల గోదాంలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఉన్నట్టుండి మంటలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. దేశ రాజధాని ఢిల్లీలో.. ఢిల్లీ-ఆగ్రా జాతీయ రహదారిపై గల పీవీసీ పైపుల గోదాంలో సోమవారం మధ్యాహ్నం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ఆస్తి నష్టం గానీ, ప్రాణ నష్టం గానీ సంభవించలేదు. అయితే, ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి దట్టమైన పొగలు కమ్మడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటనా ప్రాంతానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఫైరింజన్లతో మంటలను ఆర్పేశారు.



# గుంత తీశారు వదిలేసారు





**- గ్రామ సమస్యలు పట్టించుకోని అధికారులపై ఉన్నత అధికారులు చర్యలు చేపట్టాలి**

రాజాపేట, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): మండలంలోని కుర్రారం గ్రామంలో ప్రధాన రోడ్డుపై గుంత తీసి వదిలేశారు. గత వారం రోజుల క్రితం మంచినీటి పైప్లైన్ కోసం గుంత తీసి వదిలేశారు. ప్రధాన రోడ్డుపై గుంత తీసి వదిలేయడంతో వాహనదారులు ప్రజలు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఓవైపు మంచినీటి పైప్లైన్ వద్ద లీకేజీ ఏర్పడి నీరు నిలవడంతో కుక్కలు పందులు నీళ్లు తాగుతున్నాయి. అదే పైపులు ద్వారా మంచినీటి బోరు నీటిని గ్రామపంచాయతీ ఫిల్టర్ కు మంచినీరు సరఫరా చేస్తున్నారు దీంతో కలుషితమైన నీరు ఫిల్టర్ ద్వారా ప్రజలకు సరఫరా అవుతుందని వెంటనే గ్రామపంచాయతీ అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చడం తో పాటు లీకేజీ వ్యవస్థను సరి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇన్ని రోజులుగా గ్రామ సమస్యలు పట్టించుకోకుండా గుంత తీసి ప్రజల జీవితాలను గాలికి వదిలేసిన గ్రామ అధికారులపై బాధ్యులపై ఉన్నతాధికారులు స్పందించిన చర్యలు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# మూడు విమానాశ్రయాలకు బాంబు బెదిరింపులు..

హైదరాబాద్ : దేశంలో బాంబు బెదిరింపులు కలకలం సృష్టిస్తున్నాయి. ఇవాళ దేశంలోని పలు ప్రధాన ఎయిర్పోర్ట్లకు బాంబు బెదిరింపులు వచ్చాయి. దీంతో రంగంలోకి దిగిన అధికారులు ఆయా విమానాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సోమవారం ఉదయం రాజస్థాన్లోని జైపూర్, మహారాష్ట్రలోని నాగ్పూర్ , గోవా విమానాశ్రయాలకు ఈమెయిల్స్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. దీంతో వెంటనే ఆయా విమానాశ్రయాల అధికారులు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. రంగంలోకి దిగిన అధికారులు బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో ఆయా విమానాశ్రయాల్లో తనిఖీలు చేపట్టారు. అయితే, ఎక్కడా ఎలాంటి పేలుడు పదార్థాలు కనిపించలేదని పోలీసులు పేర్కొన్నారు. మరోవైపు బెదిరింపు మెయిల్స్ నేపథ్యంలో ఆయా విమానాశ్రయాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ఈమెయిల్ పంపిన వారి కోసం గాలిస్తున్నారు. అయితే, ఆయా విమానాశ్రయాల్లో విమాన సర్వీసులకు ఎలాంటి అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు. కాగా, దేశంలో ఇటీవలే వరుస బాంబు బెదిరింపులు కలకలం రేపుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ సహా చెన్నై, ముంబైలోని పలు పాఠశాలలకు వరుస బాంబు బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. అంతేకాదు, పలు విమానాశ్రయాలకు కూడా ఇలాంటి బెదిరింపులే వచ్చాయి. ఇలా దేశంలోని పలు పాఠశాలలు, ప్రముఖ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకటి వరుస బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది.



# జోరుగా సాగుతున్న కాంగ్రెస్ పార్టీ ప్రచారం

**- కేంద్రంలో అధికారం రావడానికి కలిసి కట్టుగా పని చేద్దాం**

**- ఎంపీగా వంశీ చంద్ రెడ్డి ని భారీ మెజారిటీతో గెలిపించుకుందాం**

**- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల నాగన్న**



దేవరకద్ర ప్రతినిధి, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు,తెలంగాణలో అమలు చేసిన హామీలు వివరిస్తూ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి నేతలందరూ కలిసి కట్టుగా ఇంటింటి ప్రచారం చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గజ్జల నాగన్న కోరారు. వనపర్తి జిల్లా దేవరకద్ర నియోజకవర్గం, మదనాపురం మండలం, తీన్మాలయాపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇంటింటి ప్రచారంలో భాగంగా దేవరకద్ర నియోజకవర్గ శాసనసభ్యులు జి.మధుసూదన్ రెడ్డి ఆదేశానుసారం పాలమూరు పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ బలపరిచిన చల్లా వంశీ చంద్ రెడ్డి కి పార్లమెంటు ఎన్నికల్లో చేతి గుర్తుకే మన ఓటు వెయ్యాలని సూచించారు. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరేసే దిశగా కాంగ్రెస్ నేతలు ఇంటింటి ప్రచారం జోరుగా సాగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై అవగాహన అవసరం

**ఎస్సై శ్రీకాంత్ రెడ్డి**

**- మేడారం, కామారం గ్రామాలలో వగాహన కార్యక్రమం**




తాడ్వాయి : సైబర్ నేరాల పట్ల ప్రజలు విద్యార్థులు యువత పూర్తిగ అవగాహన కలిగి ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని తాడ్వాయి ఎస్సై ననిగంటి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మేడారం, కామారం గ్రామాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్లలో ఓటీపీ ఓ ఎల్ ఎక్స్ పేటీఎం గూగుల్ పే ఫోన్ పే కేవైసీలను అప్డేట్ చేయమని వచ్చే మెసేజ్లకు స్పందించకూడదన్నారు. సైబర్ నేరాల గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు డయల్ చేయాలన్నారు. సైబర్ క్రైమ్ గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. సైబర్ నేరగాళు రోజుకు రీతిలో ప్రజలను మోసం చేసి డబ్బులు కాజేస్తున్నారన్నారు. ఆన్లైన్ ద్వారా లావాదేవీలు నడిపేవారు కొత్త వ్యక్తుల మాటలను నమ్మరాదని తెలియని మెసేజ్లు పై క్లిక్ చేయరాదని తెలిపారు. సైబర్ నేరగాళ్లు మాయ మాటలు చెబుతూ బహుమతులు వచ్చాయని లాటరీ తగిలిందని లోన్లు ఇస్తామని ఇతరత్రా ఆశ చూపి ఆన్లైన్ ద్వారా డబ్బులు ఇరవేస్తారని అటువంటి వ్యక్తులు పంపే మెసేజ్లకు స్పందించరాదని తెలిపారు. అంతేకాకుండా వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు పూర్తిగా సహకరించాలన్నారు. ఇలాంటి ప్రలోభాలకు లోన్ కాకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాడ్వాయి పోలీసులు ఆర్మీ రమేష్, పూజారి రమేష్, జాజ సాంబయ్య, తేజస్విని, డ్వాయి పోలీసులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫుడ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ లు తప్పనిసరి

**- ఆహార పదార్థాలు కల్తీ చేసి అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవు**

**- ఫుడ్ సేఫ్టీ కమిషనర్ హెచ్చరికలు జారీ**



భువనగిరి జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 29(తీన్మార్ న్యూస్): ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆదేశానుసారము ఎఫ్ఎస్ఎస్ఏఐ చట్టం ప్రకారం జిల్లాలో తిన దగు ఆహార పదార్థాలకు సంబంధించిన పదార్థాలను అమ్మే హెూటల్స్,టీ షాప్స్ (స్టాల్స్),కిరాణా కొట్లు ,రైస్ మిల్లులు, బేకరీ లు, స్వీట్ హౌస్ లు,పాల వ్యాపారులు, మొదలగు చిన్న, పెద్ద వ్యాపారస్తులకు ప్రతి ఒక్కరు ఫుడ్ లైసెన్స్ లు,రిజిస్ట్రేషన్ లు తప్పనిసరిగా తీసుకొనవలసినదిగా తెలియజేశారు. ఈ లైసెన్సు లను మీరు ఆన్లైన్ లో ఎఫ్ఓఎస్సిఓఎస్ అప్ ద్వారా పొందవచ్చును ఎవరికి నేరుగా డబ్బులు ఇవ్వరాదని తెలియజేశారు. అలాగే మీరు అమ్మే ఆహార పదార్థాలు ఎట్టి పరిస్థితులలో కల్తీ చేయరాదని తెలియజేస్తూ, కల్తీ చేసిన ఆహార పదార్థాలు అమ్మినట్లయితే చట్టరీత్యా నేరం మరియు మీరు అమ్మే ఆహార పదార్థాల ద్వారా ప్రజలు ఆరోగ్యరీత్యా ఏమైనా ఇబ్బందులు పడినట్లయితే దానికి మీరే బాధ్యత వహించవలసి వస్తుందని తెలిపారు. ఈ మధ్యకాలంలో జిల్లా అదనపు కలెక్టర్(రెవిన్యూ ) పి.బెన్ షాలోమ్ సుమారుగా 10 హెూటల్స్ ను పరీక్షించి నాణ్యతా ప్రమాణాలు పాటించనందుకు పేనాల్టీ (ఫైన్) విధించినారు మీరు తయారు చేసే ఆహార పదార్థాలు, బయట నుంచి తెచ్చే ఆహార పదార్థాలు అయినా వాటిపై తయారు చేసిన తేదీ మరియు ఆ లోపు అమ్మే తేది,కంపెనీ పేరు అడ్రస్,తప్పకుండ ఉండాలి మీరు అమ్మే ప్రతి ఆహార పదార్థము గుర్తింపు పొందినదై ఉండవలెను ఈ ఆదేశాలను ఉల్లంఘించి ఎవరైనా ఫుడ్ లైసెన్స్ తీసుకొనట్లయితే, ఆహార పదార్థాలు కల్తీ చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకొనబడతాయని హెచ్చరించారు. అదేవిధంగా వారి షాపును సీజ్ చేస్తామని కూడా తెలిపారు. ప్రజలకు అందించే ఆహార పదార్థాలు శుద్ధమైనవిగా , ఆరోగ్యవంతమైనవిగా, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

# అభ్యర్థి ప్రచారాన్ని బాయ్ కాట్ చేసిన పూర్వ శ్రేణులు..

అశ్వారావుపేట: ప్రస్తుతం వినిమయ రాజకీయ రంగంలో ఎవరు ఏ పార్టీలో ఎప్పటి నుండి ఉన్నా,ఏ పార్టీలో నుండి ఎవరు వలస వచ్చినా రోజు వారీ రాజకీయ వ్యవహారాల్లో,ఎన్నికల్లో సమన్వయం కోల్పోతే నష్టం వాటిల్లే ది ముందుగా ఆ పార్టీగా అనంతరం ఆ పార్టీ సాదారణ శ్రేణులు కే.అది ఎలాంటి నష్టం అనేది మనందరికీ తెలిసిందే. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో ఎప్పటి నుండో పార్టీనే నమ్ముకుని,ఆ పార్టీ ఉనికి కోసం వ్యయప్రయాసలకు లోనైన పూర్వ కాంగ్రెస్ నాయకులకు కనీస మర్యాద ఇవ్వని వలస నాయకులతో పొసగని వర్గపోరు ఎంపీ ఎన్నికలకు ప్రమాదంగా పొంచి ఉందని పలువురు సీనియర్ నాయకులు ఆవేదన చెందుతున్నారు.

ఈ క్రమంలో ఎంపీ అభ్యర్థిగా రామ సహాయం రఘురామిరెడ్డి ఎన్నికల ప్రచారానికి మొదటి సారిగా ఆదివారం వచ్చిన సందర్భంగా కనీసం సమాచారం లేదని పూర్వ కాంగ్రెస్ శ్రేణులు బాయ్ కాట్ చేయగా ఇదే అదును చూసుకుని వలస కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత ఫొటోలతో ప్లెక్సీలు ప్రదర్శించి,ఎన్నికల ప్రచారం కూలీలతో వ్యక్తిగత నినాదాలు కు తెరలేపారు.దీంతో ఒక్క సారిగా ప్రచారం లో ఉద్రిక్తత నెలకొంది.

ఇదిలా ఉండగా ఈ ప్రచారంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిమానులు,అనుచరులు సైతం కనిపించకపోవడం కొసమెరుపు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సైతం ఎన్నికల ముందే కాంగ్రెస్ లో చేరడం,ఈయనతో కాంగ్రెస్ లోకి వచ్చిన వారితోనే సఖ్యత ప్రదర్శించడంతో పూర్వ శ్రేణులు జీర్ణించుకోలేక పోతున్నారు. కరవమంటే కప్పకు,విడువమంటే పాముకు కోపం సామెతగా ఎమ్మెల్యే జారే పరిస్తితి ఉందని ఆదినారాయణ మేలు కోరే కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కొత్త పాత గ్రూపుల లొల్లి పరిష్కారం కావాలంటే మంత్రులు శ్రీనివాసరెడ్డి,తుమ్మల నాగేశ్వర రావులు జోక్యం చేసుకుని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సమక్షంలో ఇరు వర్గాలతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి రాజకీయంగా,సంస్థాగతంగా పని విభజన చేసి ఏ నాయకులు ఎందులో రాణిస్తారో వారికి ఆ బాధ్యతలు అప్పగించడం మే శరణ్యం అని సీనియర్ లు అభిప్రాయపడుతున్నారు.

# గ్రేటర్ వరంగల్ కు త్రాగు నీటి కష్టాలు

వరంగల్, ఏప్రిల్ 29: గ్రేటర్ వరంగల్ నగరానికి తాగునీటి తిప్పలు తప్పేలా లేవు! ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటుతుండటం కలవరపెడుతుండగా.. దేవాదుల పంపింగ్ నిలిచిపోవడం సమస్యగా మారింది. ఫలితంగా వరంగల్ ట్రై సిటీకి ప్రధాన తాగునీటి వనరు అయిన ధర్మసాగర్ రిజర్వాయర్ నీటిమట్టం పడిపోతోంది. అందుకే నగర ప్రజలకు రోజువారీగా సప్లై చేయాల్సిన నీటిని రెండు, మూడు రోజులకోసారి విడుదల చేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మున్ముందు మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉండగా.. నీటిని పొదుపుగా వాడుకోకపోతే బెంగళూరు దుస్థితి తలెత్తే ప్రమాదం లేకపోలేదు. వరంగల్ ట్రై సిటీకి ధర్మసాగర్ రిజర్వాయర్ తో పాటు కరీంనగర్ ఎల్ఎండీ నుంచి నీటిని సరఫరా చేస్తుంటారు. లోయర్ మానేర్ డ్యాం నుంచి ప్రతి రోజు 60 ఎంఎల్డీ(మిలియన్ లీటర్ పర్ డే) తీసుకుంటున్న అధికారులు ధర్మసాగర్ లోని ప్లాంట్ వద్ద ట్రీట్మెంట్ చేసి, వరంగల్ నగరంలోని అండర్ రైల్వే జోన్ గా పిలిచే ప్రాంతాలకు సప్లై చేస్తుంటారు. కాగా గ్రేటర్ వరంగల్ కు నీటిని సరఫరా చేయడంతో ధర్మసాగర్ రిజర్వాయర్ దే అగ్ర భాగం కాగా.. ఇక్కడికి గోదావరి నుంచి దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని పంపింగ్ చేయాల్సి ఉంటుంది. కానీ మేడిగడ్డ వద్ద పిల్లర్లు కుంగడం, కాళేశ్వరం ప్రాజెక్టులో తలెత్తిన లోపాల కారణంగా ఆ దిగువన ఉన్న దేవాదుల ప్రాజెక్టు నుంచి నీటి పంపింగ్ నిలిపేశారు. దాదాపు 20 రోజుల కిందటే పంపింగ్ ఆపేయగా, రోజువారీ వాడకం, మండుతున్న వేసవి, భూగర్భజలాలు అడుగంటుతున్న కారణంగా ధర్మసాగర్ రిజర్వాయర్ లో నీటి మట్టం తగ్గుతూ వస్తోంది.ధర్మసాగర్ రిజర్వాయర్ ఫుల్ లెవల్ కెపాసిటీ 1.5 టీఎంసీలు కాగా.. సాధారణంగా 1.2 టీఎంసీల వరకు నీటిని స్టోర్ చేస్తుంటారు. ఆ తరువాత ఇక్కడి నుంచి నీటిని వడ్డేపల్లి, కాకతీయ యూనివర్సిటీ, దేశాయిపేటలోని మూడు ఫిల్టర్ బెడ్ లకు సరఫరా చేస్తుంటారు. అక్కడి నుంచి వరంగల్ ట్రై సిటీకి వాటర్ సప్లై అవుతుంటుంది. ఇలా రోజువారీగా ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి 172 ఎంఎల్డీ (మిలియన్ లీటర్ పర్ డే) నగరానికి సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ రిజర్వాయర్ నీటి మట్టం చాలావరకు తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం రిజర్వాయర్ లో 0.6 టీఎంసీల కంటే ఎక్కువ నీళ్లు కూడా లేకపోవడం కలవరానికి గురి చేస్తోంది. ఇదిలాఉంటే ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటితో వరంగల్ నగరానికి దాదాపు మూడు నెలలపాటు తాగునీటిని అందించే అవకాశం ఉందని అక్కడి సిబ్బంది చెబుతుండటం గమనార్హం.దేవాదుల పంపింగ్ నిలిచిపోవడంతో ధర్మసాగర్ రిజర్వాయర్ అడుగంటుతుండటం సమస్యగా మారింది. దీంతో వరంగల్ నగరంలోని కాలనీలకు వంతులవారీగా రెండు, మూడు రోజులకోసారి నీటిని సరఫరా చేస్తున్నారు. వాస్తవానికి వరంగల్ లో ఒక్కో వ్యక్తికి 100 లీటర్ల చొప్పున ప్రతి రోజు సరఫరా చేయాలనే డిమాండ్ ఎప్పటినుంచో ఉంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2021 ఏప్రిల్ లో జరిగిన జీడబ్ల్యూఎంసీ ఎన్నికల ముందే మిషన్ భగీరథ పథకంలో భాగంగా నగరంలో డైలీ వాటర్ సప్లై సిస్టంను కూడా ప్రారంభించారు. నిన్నమొన్నటి వరకు అలాగే నీటి సరఫరా జరిగినా.. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. చాలా ప్రాంతాలకు రెండు, మూడు రోజులకోసారి నీళ్లు సరఫరా అవుతున్నాయి. ఇదిలాఉంటే ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నార్త్ మెన్ కెనాల్ ద్వారా భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండలాల్లోని కొన్ని గ్రామాలకు సాగునీరు సరఫరా చేయాల్సి ఉంది. కానీ ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి చివరి తడికి నీళ్లు అందక కొన్ని చోట్ల పంటలు కూడా ఎండిపోయాయి. ఇదిలాఉంటే ఇప్పటికే బెంగళూరులాంటి మహానగరాలు తాగునీటి సంక్షోభాన్ని ఎదుర్కొంటుండగా.. నీటిని పొదుపుగా వాడుకోవాలని, వృథాను అరికట్టాలని ఇక్కడి అధికారులు సూచిస్తున్నారు

# ఠాణాకు చేరుతున్న లైసెన్స్ గన్స్

కరీంనగర్, ఏప్రిల్ 29: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఠాణాకు చేరాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 263 లైసెన్సుడ్ ఆయుధాలున్నాయి. ఇందులో వ్యక్తిగతంగా వినియోగిస్తున్న 201 ఆయుధాలను సంబంధిత వ్యక్తులు పోలీస్ స్టేషన్ లో డిపాజిట్ చేశారు. మిగతా 62 ఆయుధాలను వివిధ బ్యాంకులు, ప్రభుత్వరంగ సంస్థల భద్రత కోసం వినియోగిస్తున్నారు. అప్పగించిన ఆయుధాలను లైసెన్సుదారులు జూన్ 7న తిరిగి పొందే అవకాశం ఉంటుంది. ఎన్నికల నోటిఫికేషన్ నాటికే లైసెన్సు కలిగిన ఆయుధాలను అప్పగించాలని పోలీసు శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 18న నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కాగా ఆలోపే పోలీసు శాఖ నుంచి వెళ్లిన సమాచారం మేరకు లైసెన్సు దారులు తమ పరిధిలోని ఠాణాలకు అప్పగించారు. కరీంనగర్ జిల్లాలో లైసెన్సు కలిగిన ఆయుధాలు 114, ఇప్పటి వరకూ 89 పోలీసులకు అప్పగించారు. పెద్దపల్లి జిల్లాలో 61 లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఉండగా 44, జగిత్యాల జిల్లాలో 56 లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఉండగా 45, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 32 లైసెన్స్ కలిగిన ఆయుధాలు ఉండగా 23 సంబంధిత పోలీస్ స్టేషన్ లో డిపాజిట్ చేశారు. వ్యక్తిగత భద్రత కోసం లైసెన్సు తీసుకుని వెంట ఉంచుకున్న ఆయుధాలను ఉమ్మడి జిల్లావాసులు ఠాణాలకు అప్పగించారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా ఆయుధాలను అప్పగించాలని పోలీసు శాఖ జారీ చేసిన ఆదేశాల మేరకు వంద శాతం డిపాజిట్ చేశారు. ఆయుధాల చట్టం 1959 సెక్షన్ 21 ప్రకారం వ్యక్తిగత తుపాకీ లైసెన్సు కలిగి ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్నికల సమయంలో తమ పరిధిలోని పోలీస్ స్టేషన్ లలో ఆయుధాలను అప్పగించాల్సి ఉంటుంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశం ఉండటంతో ఈ నిబంధన అమలులో ఉంది.వ్యక్తిగత భద్రత కోసం ఎవరైనా ఆయుధాలు పొందే అవకాశం ఉంది. 1959 చట్టం ప్రకారం తుపాకీ లైసెన్సు కావాలనుకునే వారు ముందుగా జిల్లా కలెక్టర్లకు దరఖాస్తు చేసుకోవాలి. అతడికి ప్రాణహాని ఉందా? అన్న విషయాన్ని ఆ ప్రాంత ఠాణా పరిధి పోలీసులు పరిశీలిస్తారు. ఆ వివరాలను సీఐ, డీఎస్పీ, ఎస్పీలకు నివేదిస్తారు. ఈ మేరకు కలెక్టర్ లైసెన్సు మంజూరు చేస్తారు. సాధారణంగా రాజకీయ నాయకులతో పాటు వ్యాపారులు, గుత్తేదారులు ఎక్కువగా ఆయుధ లైసెన్సులు తీసుకుంటారు. లైసెన్సు పొందిన వ్యక్తులు నాన్ ప్రొహిబిటెడ్ బోర్ (ఎన్పీబీ) తుపాకులను మాత్రమే కొనుగోలు చేయాలి. కేవలం ఆత్మరక్షణ కోసమే వాటిని వినియోగించాలి. వ్యక్తి గత ప్రయోజనాల కోసం, ఇతరులను బెదిరించడానికి ఉపయోగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఎన్నికల సమయంలో తప్పకుండా ఠాణాల్లో అప్పగించాలి.

# రుతుపవనాల సీజన్ తర్వాతే ఆహార వస్తువుల ధరలు తగ్గుముఖం

## అంచనా వేసిన ఆర్థిక మంత్రిత్వ శాఖ

న్యూ డిల్లీ ఏప్రిల్ 29: రుతుపవనాల సీజన్ తర్వాతే ఆహార వస్తువుల ధరలు తగ్గుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ

అంచనా వేసింది. నెలవారీ ఆర్థిక సమీక్ష నివేదికలో ప్రభుత్వం ఈ విషయాన్ని పేర్కొన్నది. భారత వాతావరణశాఖ ఈ సారి సాధారణం కంటే ఎక్కువగా వర్షాపాతం ఉంటుందని అంచనా వేసిన విషయం తెలిసిందే. వర్షాపాతం ఎక్కువ నమోదైతే పంటల ఉత్పత్తి ఎక్కువగా ఉంటుందని నివేదిక పేర్కొంది. వర్షాలతో దిగుబడులు అధికంగా వచ్చే అవకాశాలుంటాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ నెలవారీగా సమీక్షలో పేర్కొంది. భారత్‌లో రిటైల్ ద్రవ్యోల్బణం ఫిబ్రవరిలో 8.7శాతం ఉండగా.. మార్చి నాటికి 8.5 శాతానికి తగ్గింది. ద్రవ్యోల్బణం పెరుగుదలకు కూరగాయలు, పప్పుల ధరలు పెరగడం ప్రధాన కారణం. అయితే, ధరల నియంత్రణకు కేంద్రం చర్యలు చేపట్టింగి. హోర్డింగ్స్‌ను నిరోధించడంతో పాటు స్టాక్ పరిమితులను నిర్ణయించడం, బఫర్ స్టాక్‌ను బలోపేతం చేస్తూ.. మార్కెట్‌కు విడుదల చేస్తూ వచ్చింది. అదే సమయంలో ఇతర దేశాలను నుంచి దిగుమతులను సైతం సులభతరం చేసింది. ధరలను కట్టి చేసేందుకు రిటైల్ అవుట్‌లెట్స్ ద్వారా క్రమబద్ధీకరించింది. పప్పు దినుసులను దిగుమతి చేసుకునేందుకు దీర్ఘకాలిక ఒప్పందాల కోసం బ్రెజిల్, అర్జెంటీనా ప్రభుత్వాలతో చర్చలు జరుపుతున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బ్రెజిల్ నుంచి 20వేల టన్నులు పెసరపప్పు దిగుమతి కానున్నది. అర్జెంటీనా నుంచి కందుల దిగుమతి చర్చలు జరుపుతున్నది. ఈ చర్చలు ప్రస్తుతం చివరి దశకు చేరుకున్నాయి.

అదే సమయంలో మొజాంబిక్, టాంజానియా, మయన్మార్ ప్రభుత్వాలతో పప్పుల దిగుమతికి ఒప్పందం కుదుర్చుకున్నది. ఇదిలా ఉండగా.. ఇటీవల క్రిసిల్ నివేదిక సైతం జూన్ తర్వాత కూరగాయలు తగ్గుతాయని పేర్కొంది. భారత వాతావరణ శాఖ నైరుతి రుతుపవనాల సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసిందని పేర్కొంది. జూన్ వరకు సాధారణ ఉష్ణోగ్రతల కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తుందని నివేదిక తెలిపింది. దాంతో కూరగాయల ధరలు రాబోయే కొద్దిరోజులు పెరగవచ్చని చెప్పింది. ద్రవ్యోల్బణం ఫిబ్రవరి నెలలో 30శాతం నుంచి 28.3శాతానికి తగ్గింది. గతేడాదితో పోలిస్తే 8.4శాతం ఎక్కువగా. పెరుగుతున్న ధరలపై ఆర్‌బీఐ ద్రవ్య విధాన కమిటీ గతంలో ఆందోళన వ్యక్తం చేసింది.

# మాస్ మాధవి....

హైదరాబాద్, ఏప్రిల్ 29: తెలంగాణలో అన్ని లోక్‌సభ నియోజకవర్గాల కంటే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది మాత్రం హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గమే. ఎందుకంటే ఇందుకు ప్రత్యేక కారణాలున్నాయి. ఒకరు ముస్లింపార్టీకి చెందిన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ పోటీ చేస్తుండగా, ఆయనపై రూపంలోనూ, భాష?యంలోనూ హిందుత్వాన్ని కనపరుస్తున్న కొంపెల్ల మాధవీలత బీజేపీ నుంచి బరిలోకి దిగుతుంది. కొంపెల్ల మాధవీలత ఎంపికే అనూహ్యంగా జరిగింది.

ఎందుకంటే ఆమె బీజేపీలో ఉన్నట్లు ఎప్పుడూ కనిపించలేదు. పార్టీ కార్యక్రమాలలో కూడా ఆమె ఎక్కడా కనపడలేదు. అసలు పార్టీ సభ్యత్వం ఉందో కూడా తెలీని పరిస్థితుల్లో కొంపెల్ల మాధవీలతను బీజేపీ తమ పార్టీ అభ్యర్థిగా ఎంపిక చేసింది.కొంపెల్ల మాధవీలత ఎంపిక ఆషామాషీగా జరగలేదు. ఆమె హైదరాబాద్ లో పేరెన్నికగన్న విరించి ఆసుపత్రి అధినేత సతీమణి. డబ్బుకు కొదవలేదు. మంచి మాటకారి. మొన్నటి వరకూ కొంపెల్ల మాధవీలత అంటే ఎవరికీ తెలియదు. కానీ కొన్ని నెలల నుంచి సోషల్ మీడియాలో ఆమె వీడియోలు వైరల్ అవుతున్నాయి. హిందుత్వ గురించి ఆమె చెప్పే విధానం అందరినీ ఆకట్టుకుంటుంది. పక్కా హిందుత్వ వాదిగా ఆమె స్క్రీన్ పై కనపడుతుండటం కూడా కొంత కలసి వచ్చిందనే అంటున్నారు. అందుకే మరో విషయాన్ని ఆలోచించకుండా బీజేపీ కేంద్ర నాయకత్వం కొంపెల్ల మాధవీలత ను హైదరాబాద్ బీజేపీ అభ్యర్థిగా ఎంపిక చేసిందన్న కామెంట్స్ కూడా పార్టీలోనే వినపడుతున్నాయి నిజానికి అసదుద్దీన్ ఒవైసీని పాతబస్తీలో ఎదుర్కొనడం అంత ఆషామాషీ కాదు. 1984 నుంచి 2004 మధ్య ఎంఐఎం అధినేత సుల్తాన్ సలావుద్దీన్ ఒవైసీ ఆరు సార్లు ఎంపీగా అక్కడ గెలిచారు. ఆ తర్వాత 2004 నుంచి నాలుగు ఎన్నికల్లో అసదుద్దీన్ ఒవైసీ ఇక్కడ జెండా పాతేశారు. పాతబస్తీలో గెలుపు అంటే అంత సులువు కాదు. ఇప్పటికే పాతబస్తీలో అనేక దొంగ ఓట్లను తొలగించడంలో కొంత వరకూ సక్సెస్ అయ్యారని బీజేపీ వర్గాలు ఒకింత సంతోషంగా ఉన్నాయి. దొంగ ఓట్ల తోనే ఎప్పుడూ గెలుస్తారని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు. కానీ అసద్ భాయ్ ను ఓడించడం అంటే మాటలు కాదు. కానీ కొంపెల్ల మాధవీలత కు తొలి జాబితాలోనే సీటు దక్కడం చర్చనీయాంశంగా మారింది. మాధవీలత పుట్టింది పాతబస్తీలోనైనా ఆమె గెలవగల సత్తా ఉందా? అన్నదే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. వేషధారణ చూసి ఆమెను తక్కువగా కూడా అంచనా వేయలేం.

ఆమె నిజాం కళాశాలలో డిగ్రీ చదివారు. కోటిలోని ఉమెన్స్ కాలేజీలో పొలిటికల్ సైన్స్ లో పీజీ చేశారు. భరత నాట్య కళాకారిణిగా కూడా గుర్తింపు ఉంది. పాత బస్తీలో అనేక సేవా కార్యక్రమాలను గత కొద్ది రోజులుగా నిర్వహిస్తూ వెళుతున్నారు. అదే ఆమెకు కలసి వచ్చిందంటున్నారు. సోషల్ మీడియాలో వ్యూస్ వచ్చాయని ఓట్లు పడతాయా? అంటే ఆ ప్రశ్నకు సమాధానం మాత్రం దొరకదు. కానీ కొంపెల్ల మాధవీలత మాత్రం తాను పోటీలో ఉన్నానని మాత్రం బాహ్య ప్రపంచానికి చెబుతున్నారు. అసద్ ను నిజంగా ఓడించగలిగితే మాధవీ లత రికార్డుకు ఎక్కుతారు. అంతేకాదు దేశంలోనే జెయింట్ కిల్లర్ గా నిలుస్తారనడంలో సందేహం లేదు. కానీ అది సాధ్యం కావడానికి మాత్రం అవకాశాలు చాలా స్వల్పంగా ఉన్నాయంటున్నారు విశ్లేషకులు. మరి కొంపెల్ల మాధవీలత ఏ మేరకు ఓట్లు సాధిస్తారన్నది చూడాల్సి ఉంది.

# గంజాయి, కల్తీకల్లును సమూలంగా నిర్మూలిద్దాము

నిర్మల్: గంజాయి, కల్తీకల్లును సమూలంగా నిర్మూలిద్దామని జిల్లా ఎస్పీ జానకి షర్మిల పిలుపునిచ్చారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని వైయస్సార్ నగర్ కాలనీలో నిర్వహించిన పోలీసు కమ్యూనిటీ అండ్ కాంట్రాక్టు ప్రోగ్రాంలో వారు పాల్గొని ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనను కలిగి ఉండాలన్నారు. వైఎస్ఆర్ కాలనీలో అధికంగా యువత గంజాయిని సేవిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని దీనీ వల్ల కాలనీకే చెడ్డపేరు వస్తుందన్నారు. దీన్ని సమూలంగా నిర్మూలించాల న్నారు. అలాగే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ, నిబంధనలలో పాటించాలన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి వాహనాలను నడుపుతున్న పలువురిని సన్మానించారు. అనంతరం కాలనీలో గంజాయి, కల్తీకల్లును నిర్మూలించేందుకు ఏర్పాటు చేసిన పోస్టర్లను విడుదల చేసి వాటిని అతికించారు. సరైన ధ్రువపత్రాలు లేని 97 ద్విచక్ర వాహనాలు,27 ఆటోలు, ఒక కారు, మూడు వేల రూపాయల విలువ గల మద్యంను స్వాధీన పరుచుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి గంగారెడ్డి తో పాటు సిఐ రూరల్ సీఐ శ్రీనివాస్ పలువురు ఎస్సైలు పోలీసు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

# భూముల అమ్మకాలతోనే రుణమాఫీ



హైదరాబాద్, ఏప్రిల్ 29: మల్కాజ్‌గిరి ఎంపీ స్థానానికి నామినేషన్ వేసిన బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. మల్కాజ్‌గిరి గడ్డపై ఎగిరేది కాషాయ జెండానే అన్నారు ఈటల. మేడ్చల్ అసెంబ్లీ నియోజికవర్గం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో రోడ్ షో నిర్వహించిన ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో భూములు అమ్మకుండా రుణమాఫీ చేస్తే రాజకీయాల నుండి తప్పుకుంటా అంటూ రేవంత్ ప్రభుత్వానికి ఛాలెంజ్ చేశారు ఈటెల రాజేందర్.మోదీ ఏంది గిడీ ఏంది అన్న కేసీఆర్ పరిస్థితి ఏంటో చూస్తున్నాం. ఈరోజు రేవంత్ రెడ్డి కూడా అలాగే మాట్లాడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి అనేక హామీలు ఇచ్చారు. వాటిలో ఒక్క ఆర్టీసీ ఫ్రీ బస్ తప్ప ఇంకే పథకం అమలుకావడం లేదన్నారు. ఒక్క హామీ అమలు చేయకుండా మళ్లీ ఒచ్చి ఓట్లు అడుగుతున్నారు. 17 సీట్లు గెలిపించండి హామీలు అమలు చేస్తా అంటున్నారు. వారు గెలిచేది లేదు మాట నిలబెట్టుకునేది లేదన్నారు ఈటల.అంతకు ముందు కూకట్‌పల్లి కోర్టులో అడ్వకేట్లను కలిసి వచ్చే ఎన్నికలలో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఈటెల రాజేందర్ కోరారు. బార్ కౌన్సిల్ సభ్యులను, న్యాయవాదులను కలిసి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సాధించిన పురోగతులను వివరించారు. ఈ సందర్భంగా ఈటెల మాట్లాడుతూ కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు ఏ విధంగా అయితే డబ్బు, మద్యం నమ్ముకున్నాడో, అదే విధంగా నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ డబ్బును మద్యాన్ని నమ్ముకున్నట్లు కనపడుతుందని ఆరోపించారు. నాలుగు నెలల క్రితం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలకు నేడు చేస్తున్న చేతలకు సంబంధం లేకుండా పోయిందన్నారు. అతి తక్కువ కాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోతున్న ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి నిలుస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి వేసే ఓటు వాల్యూ జీరో అని, కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారు దేశంలో చేసేదేమీ లేదని అందుకే అబ్ కీ బార్ చార్ సౌ పార్ అనే నినాదంతో ప్రజలే మోదీని, తనని గెలిపిస్తారని ఈటెల రాజేందర్ ఆశాభావం వ్యక్తం చేశారు.ఇక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో న్యాయవాదులు ముందు వరుసలో ఉండి పోరాడారని, ఆనాడు ఈటెల రాజేందర్ సైతం పోరాటంలో ముందు వరుసలో ఉన్నాడని పలువురు న్యాయవాదులు గుర్తు చేశారు. అదే విధంగా బీజేపీ నినాదం అయిన అబ్ కి బార్ చార్ సౌ పార్, ఫర్ ఎక్ బార్ మోదీ సర్కార్ అనే నినాదానికి తాము సైతం మద్దతు తెలుపుతున్నామని తెలంగాణ బార్ కౌన్సిల్ వైస్ చైర్మన్ సునీల్ గౌడ్ తెలిపారు.

# రిజర్వేషన్ల చుట్టూ రాజకీయాలు

హైదరాబాద్, ఏప్రిల్ 29: తెలంగాణలో రిజర్వేషన్ రాజకీయాలు ఊపందుకుంటున్నాయి. జాతీయ పార్టీలు అయిన కాంగ్రెస్, బీజేపీ ఎన్నికల ప్రచార అంశాలుగా రిజర్వేషన్ల అంశాన్ని తీసుకుంటున్నాయి. బీజేపీ అగ్రనేత అమిత్ షా తెలంగాణలో బహిరంగసభలో ప్రసంగించి ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారు. వాటిని ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామన్నారు. అదే సమయంలో సీఎం రేవంత్ రెడ్డి మరో చోట ఇదే రిజర్వేషన్ల అంశాన్ని ప్రస్తావించారు.కేంద్రంలో మరోసారి బీజేపీ వస్తే రిజర్వేషన్లను పూర్తిగా ఎత్తివేస్తుందని హెచ్చరించారు.

ఆ పార్టీ ఆ దిశగానే ప్రయత్నిస్తోందని మరోసారి అధికారంలోకి వస్తే అదే చేస్తుందని అంటున్నారు. ఇలా జాతీయ పార్టీలు రెండు రిజర్వేషన్ల చుట్టూ ఓటింగ్ ప్రయారిటీ సెట్ చేసే ప్రయత్నం చేయడం రాజకీయవర్గాల్లో ఆసక్తికరంగా మారింది. తెలంగాణలో బీజేపీ బలం పెంచుకోవడానికి? మొదటి నుంచి ఓ అస్త్రం ప్రయోగిస్తోంది. అదే ముస్లిం రిజర్వేషన్ల రద్దు. అమిత్ షా ఎప్పుడు తెలంగాణ పర్యటనకు వచ్చినా.. ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడినా ముస్లిం రిజర్వేషన్ల గురించి ఖచ్చితంగా ప్రస్తావిస్తారు. ముస్లింలకు ఇప్పుడు నాలుగు శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. చెప్పడానికి ముస్లిం రిజర్వేషన్లు అంటున్నారు కానీ.. అవి ముస్లింలలో ఆర్థికంగా బాగా వెనుకబడిన 14 ఉపకులాలకు చెందినవారికి ఉన్నాయి. వైఎస్ హయాంలో ముస్లింలను ఆకట్టుకోవడానికి వీటిని ఇచ్చి కులాల జాబితాలో ఆయా వర్గాలను చేర్చారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగం ప్రకారం చెల్లవు. అందుకే ఈ రిజర్వేషన్లు ఎప్పటికప్పుడు వివాదం అవుతూనే ఉన్నాయి. వీరికి ఉన్న రిజర్వేషన్లను పన్నెండు శాతానికి పెంచుతామని ఉద్యమ సమయంలో కేసీఆర్ హామీ ఇచ్చారు. తర్వాత అసెంబ్లీలో తీర్మానం చేశారు ఆ తీర్మానం తర్వాత కేసీఆర్ కూడా పట్టించుకోలేదు. మునుగోడు ఉపఎన్నికలకుముందు ఎస్సీ రిజర్వేషన్లపై అధికారం లేకపోయినా జీవవో ఇచ్చారు కానీ.. ముస్లిం రిజర్వేషన్లకు ఇవ్వలేదు. గత అసెంబ్లీ ఎన్నికలకు మందు కర్ణాటకలో ఇలా ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తూ అప్పటి బీజేపీ ప్రభుత్వం జీవో ఇచ్చింది. కానీ సుప్రీంకోర్టులో అగిపోయింది. కర్ణాటకలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు ఉన్నాయి.వాటిని రద్దుచేసి నాలుగు శాతాన్ని లింగాయత్, ఒక్కలిగలకు చెరో రెండు శాతాన్ని పంచుతున్నట్లు ప్రభుత్వం జీవో ఇచ్చింది.

మతం ఆధారంగా రిజర్వేషన్లు ఇవ్వడం రాజ్యాంగ వ్యతిరేకమని, అందుకే ఈ రిజర్వేషన్లను రద్దు చేస్తున్నామని అప్పటి బీజేపీ ప్రభుత్వం వెల్లడించింది. నిజానికి కర్ణాటకలోనూ మతం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించలేదు. 1994లో మండల్ కమిషన్ సిఫార్సులకు అనుగుణంగా ముస్లింలలోని కొన్ని కులాలను ఇతర వెనుకబడిన కులాలను ఓబీసీల్లో సబ్ కేటగిరీగా చేర్చారు. ఆ కేటగరిలోనే రిజర్వేషన్లు ఇస్తున్నారు. అంటే తెలంగాణ తరహాలోనే అక్కడ కూడా కులం ఆధారంగానే ముస్లింలకు రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అందుకే ఈ అంశం సుప్రీంకోర్టులో ఆగిపోయింది. కర్ణాటకలో లాగే తెలంగాణలోనూ ముస్లిం రిజర్వేషన్లు తీసేసి ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామంటున్నారు. అయితే తెలంగాణలో ముస్లింలకు కులం ఆధారంగా రిజర్వేషన్లు ఇస్తున్నారు. కానీ, మతం ఆధారంగా ఈ రిజర్వేషన్లు వర్తింప చేస్తున్నారని అమిత్ షా అంటున్నారు. ముస్లింలు భారతీయ జనతా పార్టీకి ఓటు బ్యాంక్ కాదు. వారు ఓటు వేయరు కాబట్టి.. వారి విషయంలో బీజేపీ ప్రత్యేకమైన వ్యూహంతో ఉంటుంది. ఇప్పుడు వారి రిజర్వేషన్లు తీసేసి ఎస్సీ, ఎస్టీలకు పెంచుతామని హామీ ఇస్తున్నారు. కుల పరమైన రిజర్వేషన్లే చట్ట పరంగా అమలవుతున్నాయి కాబట్టి ముస్లింలకు ప్రత్యేకంగా రద్దు చేయలేరు.. ప్రత్యేకంగా కమిషన్ వేసి.. వారు అంటే ముస్లింలలో కొన్ని కులాల వారు అర్హులు కాదని తేల్చితే అప్పుడు తీసేయగలరు. అది అంత తేలిక కాదు. అందుకే ఇది రాజకీయ నినాదంగానే ఎక్కువ మంది భావిస్తున్నారు.

సిద్దిపేట సభలో అమిత్ షా ముస్లిం రిజర్వేషన్ల రద్దు ప్రకటన చేసిన కాసేపటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్ లో బీజేపీపై చార్జిషీట్ వేసే కార్యక్రమంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను రద్దు చేయాలని బీజేపీ కుట్ర చేస్తోందని, ఇదే మోదీ ఆఖరు అస్త్రమని స్పష్టం చేశారు. ఆర్ఎస్ఎస్ రిజర్వేషన్లను రద్దు చేయాలని లక్ష్యంగా పెట్టుకుందని ఆ ఎజెండాను అమలు చేసేందుకు రాజ్యాంగ సవరణ జరగాలని ఇందుకోసం మోదీకి మూడింట రెండు వంతుల మెజార్టీ కావాలన్నారు. అందుకే బీజేపీ నాలుగు వందల సీట్ల టార్గెట్ గా పెట్టుకుందన్నారు. బీజేపీ రాజ్యాంగాన్ని రద్దు చేస్తుందని..

రిజర్వేషన్లను కూడా వదిలి పెట్టదని కాంగ్రెస్ చాలా కాలంగా ప్రచారం చేస్తోంది. ఇప్పుడు అమిత్ షా ముస్లిం రిజర్వేషన్ల గురించి మాట్లాడటంతో.. కాంగ్రెస్ మరింత అందిపుచ్చుకుని ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమయింది. ఈ రిజర్వేషన్ల రద్దు పేరుతో ఓటర్లను భయపెట్టి ఎవరు ఎక్కువగా లబ్ది పొందుతారో చూడాల్సి ఉంది.

# నల్లగొండ కాంగ్రెస్ లో కల్లోలం..

నల్గొండ: నల్లగొండ జిల్లా పరిధిలోని మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ భార్గవ్.. 24 రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్చార్జి దీపా దాస్ మంచి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే. దీనిపై స్థానిక కాంగ్రెస్ నేతలంతా వ్యతిరేకిస్తూ నిర్ణయం తీసుకోవడంతో.. టిపిసిసి నేతలు ఆలోచనలో పడ్డారు. వెంటనే .. చేరికపై.. ఎఐసిసి ప్రధాన కార్యదర్శి (తెలంగాణ ఇన్చార్జ్) దీపా దాస్మున్షి నిలుపుదల చేశారు. నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నేతలతో సంప్రదింపులు జరిపిన తర్వాత నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అందువల్ల, మిర్యాల్గూడ మున్సిపల్ చైర్మన్ టి.భార్గవ్ చేరిక తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు తాత్కాలికంగా నిలిపివేయబడిందని.. టిపిసిసి వర్గాలు తెలిపారు.

# నల్గోండ లో గుత్తాపై అధిష్టానం గుర్రు...

నల్గోండ, ఏప్రిల్ 29: రాష్ట్ర వ్యాప్తంగా ఇపుడు అందరి చూపు ఉమ్మడి నల్గోండ జిల్లాపై పడింది. 2023 ఎన్నికల తర్వాత తెలంగాణలో అధికార మార్పిడి జరిగింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు తెరపడి.. కాంగ్రెస్ తిరిగి అధికారం చేజిక్కించుకుంది. ఈ పరిణామంతో బీఆర్ఎస్ పార్టీకి చెందిన మెజారిటీ నాయకులు తమ అధిష్టానం తీరుపై బహిరంగ విమర్శలకు దగడం మొదలు పెట్టారు. ఇన్నాళ్లూ అణచిపెట్టుకొని ఉన్న తమ నిరసనను వెళ్లగక్కుతున్నారు. ఈ లోగా ముందుకు వచ్చిన పార్లమెంటు ఎన్నికలతో బీఆర్ఎస్ ను వీడి అటు కాంగ్రెస్, మరికొందరు బీజేపీలోకి వలస బాటపట్టారు. ఈ పరిస్థితుల్లో పార్లమెంటు ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఉనికి ఉంటుందా అన్నంత స్థాయిలో చర్చ జరుగుతోంది. శాసన సభలో కాంగ్రెస్ కు మెజారిటీ ఉన్నా.. శాసన మండలి మాత్రం ఇంకా బీఆర్ఎస్ దే అధిపత్యం, ఆ మండలి చైర్మన్ గా ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి ఇపుడు పార్టీ అధినాయకత్వంపై తిరుగుబాటు చేసినట్లుగా మాట్లాడుతుండడం రాజకీయా వర్గాల్లో చర్చనీయాంశం అయ్యింది. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి దగ్గరి రాజకీయ అనుచర నాయకులంతా ఈరోజు నల్గోండలో భేటీ అవుతున్నారు. భవిష్యత్ నిర్ణయాలు తీసుకోవడంలో భాగంగానే వీరింతా సమావేశం కాబోతున్నారని విశ్వసనీయ సమాచారం. రెండు సార్లు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చి.. రెండు సార్లూ మండలి చైర్మన్ పదవిని కట్టబెట్టిన అధినాయకత్వంపై చైర్మన్ గుత్తా ఎందుకు ఆగ్రహంగా ఉన్నారు..? తెరవెనుక అసలేం జరిగింది..? ఉమ్మడి నల్గోండ జిల్లా బీఆర్ఎస్ లో జరుగుతున్న ఆధిపత్య పోరుతో ఈ ఎన్నికల్లో పార్టీ అవకాశాలను దెబ్బతీయదా అన్న చర్చ మొదలైంది. సుదీర్ఘ రాజకీయ జీవితం ఉన్న గుత్తా సుఖేందర్ రెడ్డి తెలుగుదేశంలో పాతికేళ్లకు పైగా వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయన ఒక సారి టీడీపీ నుంచి ఎంపీగా విజయం సాధించారు. ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరిన గుత్తా 2009, 2014 పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి ఎంపీగా విజయం సాధించారు. 2016లో కాంగ్రెస్ ను వీడి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు సమన్వయ సమితికి తొలి అధ్యక్షుడు కూడా ఆయనే. ఎమ్మెల్సీగా, ఆ తర్వాత మండలి చైర్మన్ గా రెండు పర్యాయాలు పదవులు పొందారు.

అయినా, పార్టీ నాయకత్వంపై నిరసన గళం వినిపిస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో తన తనయుడు గుత్తా అమిత్ రెడ్డికి నల్గోండ ఎంపీ టికెట్ ఆశించారు. అధిష్టానం సూచన మేరకు భువనగిరి ఎంపీ స్థానంలో పోటీ చేయడానికి కూడా సిద్ధ పడ్డారు. జిల్లాలోని అధిపత్య రాజకీయాలతో , మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జి.జగదీష్ రెడ్డితో ఉన్న పొరపొచ్చాలు, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన పార్టీ అభ్యర్థులు (ఇపుడు మాజీ ఎమ్మెల్యేలు ) వ్యతిరేకంగా ఉండడం వంటి కారణాలు గుత్తా అమిత్ కు టికెట్ రాకుండా చేశాయన్న అభిప్రాయం ఉంది. మాజీ మంత్రి జగదీష్ రెడ్డి కావాలనే అడ్డుపడ్డారని, అధిష్టానం వాస్తవాలు తెలుసుకోకుండా తమను పక్కన పెట్టిందన్న అసంతృప్తికి గురయ్యారు. కాంగ్రెస్ నుంచే వచ్చిన గుత్తా సుఖేందర్ రెడ్డి తిరిగి తన పాతగూటికి దగ్గర అవుతున్నారన్న విమర్శలను ఎదుర్కొంటున్నారు. వీటిని బలపరుస్తూ.. బీఆర్ఎస్ బలహీనమైన పార్టీ అని, సంస్థాగత నిర్మాణం ఏమాత్రం లేదని, ఎమ్మెల్యేలు కేంద్రంగా రాజకీయాలు నడపడం వల్లే మొన్నటి ఎన్నికల్లో అధికారం కోల్పోవాల్సి వచ్చిందని తీవ్ర ఆరోపణలు చేశారు. శాసన మండలి చైర్మన్ అయిన తనకే ఆరు నెలల పాటు నాటి సీఎం, పార్టీ అధినేత కేసీఆర్ అపాయింట్ మెంట్ దొరకలేదని బయటపెట్టారు. ఈ పరిణామాలన్నీ, ముఖ్యంగా గుత్తా ప్రకటనలన్నీ కాంగ్రెస్ వైపు ఆయన మొగ్గుచూపుతున్నారన్న వాదనకు బలం చేకూర్చాయి.

ఈ లోగా గుత్తా వ్యతిరేక వర్గం మీడియాలో, సోషల్ మీడియాలో ఆయనను విమర్శలతో వెంటాడడం మొదలు పెట్టింది. వీరి భేటీ తర్వాత వారి నుంచి కానీ, మండలి చైర్మన్ గుత్తా నుంచి కానీ ఏదన్నా నిర్ణయం, దానికి సంబంధించిన ప్రకటన బయటకు వస్తుందా అన్న ఎదురుచూపులు మొదలయ్యాయి. వాస్తవానికి 2023 శాసన సభ ఎన్నికల ముందే గుత్తా అనుచరులు పలువురు వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరారు. పార్లమెంటు ఎన్నికల వేళ కూడా ఈ వలసల పరంపర కొనసాగుతోంది. మిగిలిన వారంతా కూడా ఏదో ఒక నిర్ణయం తీసుకునేందుకే గుత్తా ఇంటిలో భేటీ అవ్వున్నట్లు చెబుతున్నారు. కేవలం తన అనుచరులను మాత్రమే బయటకు పంపి గుత్తా బీఆర్ఎస్ లోనే కొనసాగుతారా..? లేక, ఆయన కూడా తన దారి తను చూసుకుని కాంగ్రెస్ గూటికి చేరుతారా..? దీనికి సంబంధించిన ప్రకటన వెలువరిస్తారా ? అన్న ప్రశ్నలు ఉత్కంఠ రేపుతున్నాయి

# కొండాకు మద్దతుగా దేవినేని ప్రచారం




హైదరాబాద్, ఏప్రిల్ 29: తెలంగాణలో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఏపీ టీడీపీ సీనియర్ నేత దేవినేని ఉమహేశ్వరరావు మద్దతు పలికారు. ఆయనకు ఓటేయాలని చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని వారికి పిలుపునిచ్చారు. ఉన్నత విద్యావంతుడు, పలు కంపెనీలు స్థాపించి ఎంతోమందికి ఉపాధి అవకాశాలు కల్పించిన వ్యక్తి కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. ఆయనకు ప్రజలు తమ మద్దతు తెలియజేసి భారీ మెజారిటీతో గెలిపించవలసిందిగా కోరుతున్నానన్నారు. పార్లమెంటులో పలు భాషలలో అనర్గళంగా మాట్లాడి నియోజకవర్గానికి నిధులు తీసుకురాగల సమర్ధుడు, సమాజం పట్ల బాధ్యత, సేవాభావం కలిగి, నిజాయితీగా ప్రజలకు సేవ చేయాలనుకుంటున్న ఆయనకు మద్దతుగా నిలబడడం మనందరి బాధ్యత అని చెప్పుకొచ్చారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి, దేవినేని ఉమ మధ్య మంచి స్నేహం ఉన్నట్లుగా చెబుతున్నారు. పార్టీ పరంగా ఏపీలో బీజేపీ, టీడీపీ పొత్తులో ఉన్నా.. తెలంగాణ విషయంలో మాత్రం ఇంకా అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ ఇంకా ప్రకటన చేయలేదు. ప్రచారం కూడా చేయడం లేదు. దేవినేని ఉమా మహేశ్వరరావు కూడా పూర్తిగా వ్యక్తిగత హోదాలోనే కొండా విశ్వేశ్వర రెడ్డికి మద్దతు పలికినట్లుగా తెలుస్తోంది. ఆయన పార్టీ తరపున పిలుపునివ్వలేదు. కొండా విశ్వేశ్వర్ రెడ్డి అఫిడవిట్ ప్రకారం ఐదు వేల కోట్ల వరకూ ఆస్తులు ఉన్న ధనవంతుడు. అనేక కంపెనీలను పెట్టి యువతకు ఉపాధినిస్తున్నారు. ప్రస్తుతంరంగారెడ్డి జిల్లా.. కెవి రంగారెడ్డి కి గుర్తుగా ఆ పేరు పెట్టారు. కెవి రంగారెడ్డి మనవడే కొండా విశ్వేశ్వర్ రెడ్డి. ఆయన అపోలో ఆస్పత్రుల కుటుంబ సభ్యుడు. ఈ క్రమంలో ఆయన టీఆర్ఎస్ నుంచి రాజకీయాల్లోకి వచ్చారు. మొదట 2014లో టీఆర్ఎస్ నుంచి చేవెళ్ల లోక్ సభకు పోటీ చేసి విజయం సాధించారు. ఆ పార్టీలో ఇమడ లేక 2019లో బయటకు వచ్చి కాంగ్రెస్ లో చేరారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. ఈ సారి బీజేపీ తరపున బరిలో ఉన్నారు. ఇటీవల చేవెళ్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన రేవంత్ రెడ్డి కూడా కొండా విశ్వేశ్వర్ రెడ్డిపై ఎలాంటి ఆరోపణలు చేయలేదు. ఆయన మంచి వ్యక్తే కానీ..బీజేపీకి ఓటు వేస్తే వృధా అన్నారు వ్యక్తిగతంగా మంచి వ్యక్తిగా పేరు తెచ్చుకున్న కొండా విశ్వేశ్వర్ రెడ్డికి పార్టీలకు అతీతంగా పలువురు నేతలు మద్దతు పలుకుతున్నారు. దేవినేని ఉమామహేశ్వరరావుకు ఈ ఎన్నికల్లో టిక్కెట్ లభించకపోవడంతో పోటికి దూరంగా ఉన్నారు. అయినా మైలవరం నియోజకవర్గంలో టిక్కెట్ దక్కించుకున్న వసంత కృష్ణ ప్రసాద్ కోసం ప్రచారం చేస్తున్నారు. టీడీపీ ఎన్నికల ప్రక్రియలో కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

# రాజేందర్ రావును గెలిపించండి

జగిత్యాల జిల్లావేములవాడ: వేములవాడ నియోజకవర్గంలోని భీమారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో మంత్రి పొన్నం ప్రభాకర్, , ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, , కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలి చాల రాజేందర్ రావు ఇతర ముఖ్య నేతలు పాల్గోన్నారు.

మంత్రి మాట్లాడుతూ మీరు డబుల్ బెడ్రూం ఇచ్చిన ఊర్లలో ఓట్లు అడగం.. మేము ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఊర్లలోకి మీరు రావద్దు. ఉద్యోగాల్ ఇస్తామని మోసం చేశారు. కాంగ్రెస్ పార్టీ 50 ఎల్ల నుండి పాలిస్తుంది. .. అప్పుడు శ్రీరామ నవమి జరగలేదా...? హనుమాన్ చాలిసా చదవలేదా...? ఒక ప్రధాని స్తాయి వ్యక్తి ఆయనేమో ఆధాని , అంబానీలకు దోచిపెట్టాడు. కాంగ్రెస్ అధికారంలోకి సంబంధ ముస్లింలకు పంచుతారని అంటున్నాడు. 50 ఏళ్లలో ఎప్పుడైనా చేశామా. బీజేపీ ప్రభుత్వం తెలంగాణ లో ఉన్నా హిందువులకు ఎం చేసిందొ చెప్పాలి. శ్రీరాముడి కళ్యాణం తరువాత అక్షింతలు వస్తాయి.. కాని అయోధ్య లో గుడి ప్రారంభం కూడా కాలేదు ఊర్లలో పసుపు బియ్యం కలిపి అక్షింతల పేరు మీద పంచుకొని బిచ్చగాల్ల లెక్క ఓట్లు అడుగుతున్నారు. దేవుడు గుడిలో ఉండాలి..భక్తి గుండెల్లో ఉండాలి. 10 సంవత్సరాల బీజేపీ పాలన లో దేశం కోసమో... తెలంగాణ కోసమో.. వేములవాడ కోసమో..భీమారం కోసమో ఎం చేశారొ బీజేపీ నేతలు చెప్పాలి.

తల్లి కి పుట్టిన బిడ్డ నర్స్ చెప్పే వరకు తెలియదంటున్న మూర్ఖుడు మన ఎంపి. ఇటువంటి వాడు మన ఎంపి అని మాతృమూర్తులు అవమనపడుతున్నారు. రాజేందర్ రావు చదువుకున్న వ్యక్తి...వాళ్ల నాన్న రాజకీయాల్లో ఉన్నాడు. మంచిగా పని చేస్తాడు .ఒక పక్క ఆది శ్రీనివాస్.. మరో పక్క రాజేందర్ రావు ఎంపిగా ఉంటే మరింత అభివృద్ధి జరుగుతుంది..ఈ దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఇందిరమ్మ మనవడు రాజీవ్ గాంధీ కొడుకు దేశం కోసం ఇంత కష్టపడుతుంటే పాదయాత్ర చేస్తుంటే నరేంద్ర మోడీ పూటకో వేషం వేస్తూ.. నొట్ల రద్దు చేసి , నిత్యవసర ధరలు పెంచి ప్రజలను ఇబ్బందులు పెడుతూ మన ముందుకు వస్తున్నారు .జాగ్రత్త. ఇందిరమ్మ పాలన అంటే తల్లులందరికీ ఒక ఆశీర్వాదం.

ఇందిరమ్మ పాలన రావాలంటే మీ ఊర్లలో ఇల్లులేనివారికి ఇందిరమ్మ ఇళ్లు రావాలంటే.. రేషన్ కార్డులు రావాలంటే,4000 పెన్షన్ రావాలంటే , వరికి 500 బోనస్ రావాలంటే మమ్మల్ని గేలిపించినట్టు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి. రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఈ హామీలు అమలు చేసే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం ది. మమ్మల్ని ఆశీర్వదించండి.. తప్పకుండా మీ రుణం తీర్చుకుంటం.. ఎమ్మెల్యే గా మీ గౌరవాన్ని పెంచే విధంగా పని చేస్తాం.. మీ సమస్యలు పరిష్కరిస్తం.రాజేందర్ రావు ని ఆశీర్వదించి గెలిపించండని కోరారు.

# అదిలాబాద్ కాషాయంలో కషాయం...

అదిలాబాద్, ఏప్రిల్ 27 (న్యూస్ పల్స్): ఎన్నికలకు ఇంకా మూడు వారాలు కూడా లేని ఈ సమయంలో ఇక్కడి కాషాయ దళంలో అసమ్మతి మళ్లీ భగ్గుమంటోంది. బరిలో ఉన్న కాషాయ అభ్యర్థికి ఏసీలోను చెమటలు పట్టే పరిస్థితిని తెస్తుందంట. కారణం ఈ పార్లమెంట్ పరిధిలో గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు కలిసినట్టుగానే కలిసి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. అయితే జిల్లాకు చెందిన ముఖ్య నేత మాత్రం కినుక వహించి తిరుగుతున్నారట. అభ్యర్థి ప్రకటన నుండి పార్టీకి దూరంగా ఉంటూ, నా దారి నాదే అన్నట్టుగా వ్యవహరిస్తున్న ఎంపీ సోయం బాపురావు వ్యవహార శైలి నేతల్లో గుబులు పుట్టిస్తోంది. నెల రోజులుగా మౌనం దాల్చిన సోయం బాపురావు నా రూటే సపరేట్ అంటూ తనదైన స్టైల్ లో అభ్యర్థికి షాక్ ల షాక్ ఇస్తున్నాడట. గెలిపే లక్ష్యంగా కాషాయ క్యాడర్ గడపగడపకు ప్రచారం చేస్తున్నా, బీజేపీకి ఆదివాసీ గూడాల నుండి ఆ స్థాయి మద్దతు రావడం లేదట. కారణం సోయం బాపురావు నిర్ణయమే అని టాక్ బలంగా రీసౌండ్ ఇస్తోందట. కారణం ఆయన బీజేపీ అభ్యర్థి గోడెం నగేష్ కు కాకుండా మరోసారి ఆదివాసీ నేతకు జైకొట్టడమే అని తెలుస్తోంది. ఎంపీగా మరోసారి సీట్ దక్కకపోవడంతో అలక బూనిన సోయం బాపురావు, నెల రోజులుగా పార్టీకి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. తాజాగా బీజేపీ అభ్యర్థికి మద్దతు ఉపసంహరించుకోవడం ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. అక్కడితో ఆగకుండా ఆదివాసీ గూడాల్లో ఆదివాసీ పెద్దలతో రహస్యంగా సమావేశమై, తాను బీజేపీలోనే ఉన్నానని, కానీ ఆదివాసీల పక్షాన నిలిచే నేతకే ఈసారి పట్టం కట్టాలని, పార్టీలు ముఖ్యం కాదు నేతలే ముఖ్యం అంటూ తనదైన శైలిలో ఒంటరి ప్రచారం చేస్తున్నారట. అయితే ఆ ప్రచారం బీజేపీ అభ్యర్థికి మద్దతుగా చేస్తున్నది కాకపోవడంతో సోయం ఎవరి పక్షాన నిలిచి ఒంటరి ప్రచారం చేస్తున్నారనే చర్చ పార్లమెంట్ పరిధిలో జోరుగా సాగుతోంది. ఆదివాసీ ఉద్యమ నేతకే పట్టం కట్టాలని సోయం బాపురావు గూడాల్లో గడపగడపకు తన సమాచారం చేరవేస్తుండటంతో.. ఆ ఉద్యమ నేత ఎవరనే టాక్ ఇటు బీజేపీ పార్టీలో అటు రాజకీయవర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే ఆ ఆదివాసీ ఉద్యమ నేత తన చిరకాల మిత్రుడే అన్న టాక్ పార్టీలో రీ సౌండ్ ఇస్తుండటంతో సోయంను దారికి తెచ్చుకునేందుకు అధిష్టానం, పార్లమెంట్ ఇంఛార్జ్ విశ్వప్రయత్నాలే చేస్తున్నారట. బీజేపీ అభ్యర్థి గోడెం నగేష్ నామినేషన్ ర్యాలీకి రావాలంటూ పార్లమెంట్ ఇంఛార్జ్ కాకపట్టినా.. అదిష్టానం నుండి ఫోన్ వచ్చినా, నో వే అంటూ తన నిర్ణయాన్ని ప్రకటించారట. దీంతో ఎంపీ సోయం ఏం చేస్తాడో అంటూ ఆందోళన చెందుతున్నారు క్యాడర్.

అయితే ఇదే సమయంలో పార్లమెంట్ పరిధిలో గెలిచిన నలుగురు ఎమ్మెల్యేల మధ్య సోయం వ్యవహారం చర్చకు రావడం.. నామినేషన్ ర్యాలీలో జనసమీకరణ లేక ర్యాలీ చప్పగా సాగడంతో ఆ నలుగురిలో ఓ ఇద్దరు కీలక ఎమ్మెల్యేల మధ్య జనసమీకరణ విషయంలో అసమ్మతి మరోసారి భగ్గుమందట. కలిసుంటే కలదు సుఖం అని అధిష్టానం నెత్తి నోరు కొట్టుకుంటున్నా, ఆదిలాబాద్ పార్లమెంట్‌లో నేతల మధ్య ఆ సఖ్యత కనిపించక పోవడంతో అసలుకే ఎసరు వచ్చే ప్రమాదం ఉందన్న సంకేతాలు కనిపిస్తున్నాయంటోంది క్యాడర్. ఓ వైపు ప్రత్యర్థి పార్టీలు



ఎన్నికల ప్రచారంలో దూసుకెళుతుంటే, అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటి కాషాయ అడ్డాగా మార్చుకున్న ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో విజయకేతనం ఎగరవేయాల్సిన కాషాయ పార్టీ మాత్రం ఇంకా అసమ్మతి రాగమే ఎత్తుకుని సాగుతుండటం విస్మయానికి గురి చేస్తోందట. దీంతో ఇదే అదునుగా బావించిన ప్రతిపక్ష పార్టీలు ప్రచారంలో పదడుగులు ముందుకు దూసుకెళ్లగా.. సిట్టింగ్ సీటును కాపాడుకుని విజయకేతనం ఎగర వేయాల్సిన బీజేపీ మాత్రం అసమ్మతి.. అలకలు.. నాయకుల మధ్య అంతర్గత పోరుతో వెనక్కి సాగుతున్నట్టుగానే కనిపిస్తుంది. చూడాలి మరీ నాదారి నాదే అంటూ సాగుతున్న సోయం తీరు.. ఎమ్మెల్యేల మధ్య కుదరని సఖ్యత.. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిదిలో బీజేపీ గెలుపును ఏ తీరాలకు చేరుస్తుందో..!

# ముచ్చటగా మూడవసారి భువనగిరి పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం



– కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

భువనగిరి: భువనగిరి పార్లమెంట్ ఓఖ స్థానాన్ని ముచ్చటగా మూడోసారి కాంగ్రెస్ జెండాను ఎగరేస్తామని భువనగిరి పార్లమెంట్ ఎన్నికల ఇన్చార్జి, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కేంద్రం లో కాంగ్రెస్ పార్టీ రోడ్ షో నిర్వహించారు. ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి , ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరిలో కాంగ్రెస్అభ్యర్థిని గెలిపించేందుకు కార్యకర్తలు కృషిచేయాలన్నారు. పదేండ్లలో కేసీఆర్ తన కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చారు తప్ప.. తెలంగాణలోని యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ సుస్థిర ప్రభుత్వం ఉండాలంటే కిరణ్ కుమార్ రెడ్డిని ఎంపీగా గెలిపించాలని పిలుపునిచ్చారు. హరీష్ రావు కి ప్రజలు ఇప్పుడు గుర్తొచ్చారాని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని కుని చేసిన వ్యక్తి ప్రతిపక్ష పార్టీ లేకుండా చేసిన వ్యక్తి కెసిఆర అన్నారు. బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ కండువాలు జేబులో పెట్టుకుని తిరుగుతున్నారు.

# దివంగత సాయన్నను అవమానించిన కేసీఆర్



సికింద్రాబాద్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దివంగత ఎమ్మెల్యే సాయన్న కు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరపకపోవడం దళిత ఎమ్మెల్యే ను అవమానించడమే అని కంటోన్మెంట్ భాజపా అభ్యర్థి వంశిశ తిలక్ అన్నారు..దివంగత ఎమ్మెల్యే సాయన్న పట్ల కెసిఆర్ కు సానుభూతి లేనప్పుడు ఆయన కుటుంబాన్ని సభ్యులపై కంటోన్మెంట్ ప్రజలు సానుభూతి చూపాల్సిన అవసరం లేదని కంటోన్మెంట్ భాజపా అభ్యర్థి వంశా తిలక్ అన్నారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో మూడవ వార్డులోని కేకే నగర్ లో భాజపా కార్నర్ మీటింగ్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటోన్మెంట్ లో భాజాపాకు ఓటు వేస్తే అభివృద్ధికి ఓటు వేసినట్టే అని అన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలు కంటోన్మెంట్లో తాగునీటి సమస్యను పట్టించుకున్న పాపను పోలేదని అన్నారు. కాంగ్రెస్ బారాస నాయకులు చెబుతున్న మాటలను నమ్మి కంటోన్మెంట్ ప్రజలు మోసపోవద్దని ఆయన సూచించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

# పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాల్గొన్న మంత్రులు

భద్రాద్రి కొత్తగూడెం: దమ్మపేట మండలం వడ్లగూడెం దుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ఖమ్మం పార్లమెంట్ స్థానం విజయం కాంక్షిస్తూ రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశంలో మంత్రులు ఎంపీ అభ్యర్థి పాల్గొన్నారు. కాళేశ్వరం, ధరణి లొసుగులు, ప్రశ్నా పత్రాల లీకేజి సహా ఎన్నో అక్రమాలు ఃఖీూ హయాంలో జరిగాయని రామ సహాయం అన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచక పాలన నచ్చకే రాష్ట్ర ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని,కేసీఆర్ కి ముఖ్యమంత్రి గా వున్నప్పుడు రైతు కష్టాలు కనపడలేదని ఇప్పుడు మాత్రం రైతుల కష్టాలు కనిపిస్తున్నాయా అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ దోచుకున్న కోట్లు దాచుకోవడానికే దొంగ దీక్షలు,దొంగ పర్యటనలు చేస్తున్నారన్నారు. దేశంలోనే తెలంగాణ ని మోడల్ గా నిలబెడతామని మంత్రి పొంగులేటి అన్నారు. రామసహాయం రఘురామరెడ్డి సుదీర్ఘ రాజకీయ నేపద్యము న్న వ్యక్తి అని, కులాల మధ్య చిచ్చు పెట్టే పార్టీ బీజేపీ అని, మొది సాక్షాత్తు రాముణ్ణే బ్యాలెట్ బాక్స్ దగ్గరకి తెచ్చారని తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.కేసీఆర్ ఓడిపోయి దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని, కేసీఆర్ చవకబారు మాటలు మాట్లాడవద్దని, మాజీ ముఖ్యమంత్రిగా హోదా కాపాడుకోవాలన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి రామసహాయం రఘురామరెడ్డి ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు.

# 'ప్రసన్న వదనం' సినిమా చాలా బావుంది. మే3న థియేటర్‌కు వెళ్లి సినిమా చూడండి.

సినిమా ఖచ్చితంగా మిమ్మల్ని అలరిస్తుంది: ట్రైలర్ లాంచ్ ఌ ప్రీరిలీజ్ ఈవెంట్ లో స్టార్ డైరెక్టర్ సుకుమార్

యంగ్ ట్యాలెంటెడ్ సుహాస్ హీరోగా రూపొందిన యూనిక్ సస్పెన్స్ థ్రిల్లర్' ప్రసన్న వదనం'. స్టార్ డైరెక్టర్ సుకుమార్ వద్ద అసోసియేట్ గా పని చేసిన అర్జున్ వై కె దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జెఎస్ మణికంఠ, టి ఆర్ ప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. పాయల్ రాధాకృష్ణ, రాశి సింగ్ హీరోయిన్స్ గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదల ఈ సినిమా టీజర్, సాంగ్స్ కి ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. మే3న సినిమా ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ ట్రైలర్ లాంచ్, ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించింది. స్టార్ డైరెక్టర్ సుకుమార్ ముఖ్య అతిధిగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్ గా జరిగింది. దర్శకులు బుచ్చిబాబు, కార్తిక్ దండు, శ్రీనివాస్ అవసరాల, రైటర్ ప్రసన్న ఈ వేడుకలో పాల్గొన్నారు. ప్రీ రిలీజ్ ఈవెంట్ లో స్టార్ డైరెక్టర్ సుకుమార్ మాట్లాడుతూ..“సుహాస్.. అంటే నాకు, బన్నీకి చాలా ఇష్టం. 'పుష్ప'లోని హీరో ఫ్రెండ్ క్యారెక్టర్ కేశవగా ముందు సుహాస్ ని అనుకున్నాం. కానీ, అప్పటికే సుహాస్ హీరోగా చేయడంతో ఆ రోల్‌కి ఎంపిక చేయడం బాగోదనిపించింది. నాని నటన నాకు బాగా ఇష్టం. సుహాస్.. ఫ్యూచర్ నానిలా అనిపిస్తున్నాడు. నాని సహజ నటుడు కాబట్టి సుహాస్‌ని మట్టి నటుడు అనాలేమో. అంత ఆర్గానిక్ గా వుంది. తన నటన చూస్తున్నాను. ఆయా పాత్రల్లో ఇమిడిపోతాడు. ఇందులో రాశీసింగ్, పాయల్ రాధాకృష్ణ చక్కగా నటించారు. విజయ్ బుల్గానిన్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. మా అర్జున్ కి సినిమా ఇచ్చిన నిర్మాతలు ధన్యవాదాలు. నేను 'జగడం' సినిమా రూపొందిస్తున్న సమయంలో అర్జున్ కలిశాడు. 'మీ 'ఆర్య' చిత్రం నాకు బాగా నచ్చింది సర్. మీ వద్ద పని చేయాలనుకుంటున్నా' అని అన్నాడు. టీమ్‌లో జాయిన్ చేసుకున్నా. అర్జున్ చాలా అమాయకుడు. కానీ, బోలెడు లాజిక్ ఉన్నవాడు. అర్జున్, మరో అసిస్టెంట్ తోట శ్రీనుతో కలిసి 23 రోజుల్లో '100% లవ్' స్టోరీ రాశా. అప్పటి నుంచి నా ప్రతి సినిమాకి వీరిద్దరు పనిచేశారు. వీళ్లతోపాటు ఒక్కో చిత్రానికి ఒక్కొక్కరు యాడ్ అవుతూ ఉండేవారు. అర్జున్ కి ఏదైనా సమస్య చెబితే పరిష్కారం సెకన్స్ లో చెబుతాడు.



నిజానికి తను హాలీవుడ్ లో వుండివుంటే మరో స్థాయి సినిమా తీసేవాడు. అంత లాజిక్ వున్నవాడు. అర్జున్ బిజీగా ఉండడంతో నేను లాజిక్ ఉన్న సినిమాలను మానేశా. అంటే మీరు అర్థం చేసుకోవచ్చు. ఆ లాజిక్ తోనే ప్రసన్న వదనం తీసాడు. తను చాలా నిజాయితీ పరుడు. ఈ సినిమాని చాలా నిజాయితీగా తీశాడు. తన ప్రేమ, నిజాయితీ చాలా ఇష్టం. ఈ సినిమా చూశాను. చాలా బావుంది. ఏ కరెక్షన్ చెప్పలేకపోయాను. అంత చక్కగా తీశాడు. థియేటర్‌కు వెళ్లి సినిమా చూడండి.. నా అర్జున్‌ని సపోర్ట్ చేయండి. సినిమా ఖచ్చితంగా మిమ్మల్ని అలరిస్తుంది' అన్నారు.

హీరో సుహాస్ మాట్లాడుతూ.. 'ప్రసన్న వదనం' మే 3న విడుదలౌతోంది. కలర్ ఫోటో, రైటర్ పద్మ భూషణ్, అంబాజీ పేట.. ఈ సినిమాలన్నీ ప్రేక్షకులని అలరించాయి. ప్రసన్న వదనం కూడా ఖచ్చితంగా ఆడియన్స్ ని అలరిస్తుంది. ప్రేక్షకులు థియేటర్స్ దాక వస్తే చాలు.. అక్కడ మేము చూసుకుంటాం. ఖచ్చితంగా అందరికీ నచ్చుతుంది. అర్జున్ చాలా కష్టపడి ఈ సినిమాని తెరకెక్కించారు. నిర్మాతలు చాలా పాషన్ తో సినిమాని నిర్మించారు. పాయల్, రాశి చక్కగా నటించారు. విజయ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. సుకుమార్ గారు ఈ వేడుకకు రావడం చాలా ఆనందంగా వుంది. సుకుమార్ గారికి వాళ్ళ టీం అంటే చాలా ఇష్టం. చాలా ప్రేమిస్తారు. మా సినిమాకి సపోర్ట్ చేయడానికి వచ్చిన సుకుమార్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు' తెలిపారు.

దర్శకుడు బుచ్చిబాబు సాన మాట్లాడుతూ.. మేమంతా దర్శకులిగా వచ్చాం అంటే కారణం సుకుమార్ గారు. ఆయన నుంచి ఇంకా చాలా మంది దర్శకులు వస్తారు. సుహాస్ ప్రతి సారి కొత్త కంటెంట్ తో వస్తారు. అర్జున్, సుకుమార్ గారి దగ్గర వర్క్ చేస్తునప్పటినుంచి తెలుసు. అర్జున్ నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. అర్జున్ అన్న చాలా కష్టపడ్డారు. అర్జున్ చాలా పెద్ద డైరెక్టర్ అవుతారు. ఈ సినిమా పెద్ద హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.

దర్శకుడు కార్తిక్ దండు మాట్లాడుతూ.. సుకుమార్ గారి విరూపాక్ష కథ చెప్పినపుడు అర్జున్ కి చెప్పు ఇన్ పుట్స్ ఇస్తాడని అన్నారు. అర్జున్ కథ చెప్పిన తర్వాత చాలా విలువైన సలహాలు ఇచ్చారు. నా విజయంలో ఆయన వున్నారు. ఈ సినిమా కథ తెలుసు. తప్పకుండా పెద్ద విజయం సాధిస్తుంది. కొత్త దర్శకులకు సుహాస్ బెస్ట్ ఆప్షన్ అవుతున్నారు. విజయ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. టీం అందరికీ ఆల్ ది బెస్ట్' చెప్పారు.

నటుడు, దర్శకుడు శ్రీనివాస అవసరాల మాట్లాడుతూ.. అర్జున్ తో కలసి ఓ షార్ట్ ఫిలిం చేశాను. అర్జున్ దర్శకుడు అవుతాడని చాలా ఎదురుచూశాను. ఇప్పుడు అర్జున్ గురించి మాట్లాడటం చాలా ఆనందంగా వుంది. సుకుమార్ గారు అంటే చాలా ఇష్టం. సుకుమార్ గారి దగ్గర పని చేయడం అదృష్టం. ఆయన దగ్గర చాలా నేర్చుకున్నాను. సుహాస్ గారు ప్రతి సినిమాకి ఎదుగుతున్నారు. ఈ సినిమా కూడా పెద్ద విజయం సాధించి, మంచి పేరు తీసుకురావాలని కోరుకుంటున్నాను. టీం అందరికీ ఆల్ ది బెస్ట్' తెలిపారు

రైటర్ ప్రసన్న కుమార్ బెజవాడ మాట్లాడుతూ.. ట్రైలర్ చాలా బావుంది. సుహాస్ గారు ప్రతి సినిమాకి ఎదుగుతున్నారు. ఈ ఇంకా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. నిర్మాత మణిగారి ఈ సినిమా పెద్ద విజయం సాధించి పెట్టాలని కోరుకుంటున్నాను. అర్జున్ రూమ్ పక్కనే మా రూమ్ వుండేది. ఆయన సుకుమార్ గారి దగ్గర పని చేశావారని తెలిసి మా ఆనందాని హద్దులు లేవు. ఒకసారి ఆర్య 2 షూటింగ్ కి కూడా తీసుకెళ్ళారు. ఆ క్షణం మర్చిపోలేం. సుకుమార్ గారి అర్జున్ పై చాలా నమ్మకం. నాన్నకు ప్రేమతో సినిమాలో ఒక ఫైట్ ని షూట్ చేసే అవకాశం అర్జున్ కి ఇచ్చారని విన్నాను. అలాంటి అర్జున్ ఈ సినిమాని చాలా అద్భుతంగా ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారని నమ్ముతున్నాను. టీం అందరికీ ఆల్ ది బెస్ట్. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి' అని కోరారు

చిత్ర దర్శకుడు అర్జున్ మాట్లాడుతూ.. సినిమాని అనుకున్నదాని కంటే చాలా గ్రాండ్ గా చేశాం. నిర్మాతలు చాలా అద్భుతంగా సపోర్ట్ చేశారు. సుహాస్ దర్శకుల నటుడు. ఈజీగా పాత్రలోకి వెళ్ళిపోతారు. దర్శకుడి మనసులో ఏముందో తనకి తెలిసిపోతుంది. శ్రీనివాస్ అవసరాల గారి ఓ షార్ట్ ఫిల్మ్ చేశాను. ఆ అనుభవం చాలా పనికొచ్చింది. బుచ్చి, కార్తిక్, ప్రసన్న ఈ వేడుకకు రావడం అనందంగా వుంది. విజయ్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. డైరెక్షన్ టీం చాలా సపోర్ట్ చేసింది. రాశి, పాయల్ చక్కగా నటించారు. ఈ సినిమాలో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. సుకుమార్ గారి దగ్గర నుంచి నా జర్నీ మొదలైయింది. ఆయన దగ్గర ల్యాండ్ అవ్వడంతో మొదట నుంచి ఆయన స్థాయిలో ఆలోచించడం మొదలుపెడతాం. ఆయన ఇచ్చిన జ్ఞానం, చనువు మర్చిపోలేను. ఈ సినిమా చూసి 'శెబాష్' అన్నారు. అదొక్కటి చాలు నాకు. ఈ సినిమాని పంపిణీ చేస్తున్న మైత్రీ మూవీస్, హంబలే సంస్థలకు ధన్యవాదాలు. ఫేస్ బ్లైండ్ నెస్ కాన్సెప్ట్ తో వస్తున్నాం. చాలా అద్భుతంగా వచ్చింది. అందరం హ్యాపీగా వున్నాం. ప్రేక్షకులు ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. మే3న తప్పకుండా చూడండి' అన్నారు,

హీరోయిన్ రాశి సింగ్ మాట్లాడుతూ.. ప్రసన్న వదనం యూనిక్ కాన్సెప్ట్. కథ వినగానే వర్క్ అవుట్ అవుతుందనిపించింది. దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు. ఇందులో నా పాత్ర కొత్తగా వుంది. ఈ అవకాశం ఇచ్చిన దర్శకుడు అర్జున్ కి ధన్యవాదాలు. సుహాస్ గారు చాలా నేచురల్ యాక్టర్. ఆయనతో పని చేయడం ఆనందంగా వుంది. ఈ సినిమాలో పని చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మే3న తప్పకుండా సినిమా చూడండి' అన్నారు

హీరోయిన్ పాయల్ రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. సుహాస్ , అర్జున్, రాశి ఇలా మంచి టీంతో ఈ సినిమా చేశాం. ఈ సినిమాలో పని చేయడం చాలా ఆనందంగా వుంది. సినిమా తప్పకుండా అందరినీ అలరిస్తుంది' అన్నారు.

నిర్మాత మణికంఠ మాట్లాడుతూ.. సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. సినిమా వందశాతం బ్లాక్ బస్టర్. కలర్ ఫోటో తో నా జర్నీ మొదలైయింది. సుహాస్ కెరీర్ లో నా పేరు ఖచ్చితంగా ఓ పేజీ లో వుంటుంది. మా స్నేహం అలానే వుండాలని కోరుకుంటున్నాను. బుచ్చిబాబు, ప్రసన్న, అవసరాల శ్రీనివాస్, కార్తిక్ ఈ వేడుకకు రావడం ఆనందంగా వుంది. మొదట ఈ కథ అరవింద్ గారు విని చేద్దామనుకున్నారు. రవికాంత్, శ్రీనివాస్, మై హోం రామ్ గారికి ధన్యవాదాలు. రాజేష్ గారు చాలా సపోర్ట్ చేశారు. మా డిస్ట్రిబ్యూటర్స్ మైత్రీ, హంబలే ఫిలిమ్స్ కి ధన్యవాదాలు. దర్శకుడు అర్జున్ అద్భుతంగా తీశాడు. మే3న సినిమా ఖచ్చితంగా చూడండి. సినిమా చాలా బావుటుంది' అన్నారు.

నిర్మాత ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. సుహాస్ గారితో జర్నీ చాలా బావుంది. రాశి, పాయల్ చక్కగా నటించారు. విజయ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. టీం అందరూ చాలా అద్భుతమైన వర్క్ ఇచ్చారు. మే3న సినిమా విడుదలౌతుంది. తప్పకుండా చూడండి' అన్నారు. చిత్ర యూనిట్ అంతా పాల్గొన్న ఈ వేడుకు చాలా గ్రాండ్ గా జరిగింది.

# విజయవంతంగా 50 రోజులు పూర్తిచేసుకున్న బుల్లెట్ చిత్రం బుల్లెట్ చిన్న చిత్రం కాదు.. మంచి సినిమా



శ్రీ బండి సదానంద్ ఌ మెమరీ మేకర్స్ సోమిసెట్టి హరికృష్ణ సమర్పించు, తుమ్మూరు కోట ఫిలిం సర్క్యూట్ బ్యానర్ పై నిర్మించిన చిత్రం బుల్లెట్. ఎవ్వడికైనా దిగుడ్డి ట్యాగ్ లైన్ తో దర్శకుడు చౌడప్ప రూపొందించారు. హీరో రవి వర్మ, సంజనా సింగ్, ఆలోక్ జైన్ ,మనీషా దేవ్, జీవ ,విజయ రంగరాజు ,సంధ్య శ్రీ, నర్సింగ్ యాదవ్, జబర్దస్త్ అప్పారావు ప్రధాన పాత్రలు పోషించారు. మార్చి 8న విడుదలైన ఈ చిత్రం 50 రోజులు పూర్తి చేసుకొని సక్సెస్ ఫుల్ గా ఇంకా థియేటర్లో కొనసాగుతుంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ శుక్రవారం సాయంత్రం హైదరాబాదులోని ప్రసాద్ ల్యాబ్స్ లో ఈ చిత్ర 50 రోజుల వేడుకను నిర్వహించారు.

ముఖ్య అతిథులుగా శోభారాణి, దర్శకులు వి సముద్ర హాజరయ్యారు. శోభారాణి గారు మాట్లాడుతూ..”చిన్న చిత్రాలు రెండు మూడు రోజులు కూడా ఆడని ఈ రోజుల్లో బుల్లెట్ 50 రోజులు పూర్తి చేసుకొని ఇంకా సక్సెస్ ఫుల్ గా రన్ అవడం మామూలు విషయం కాదు. బుల్లెట్ ఇప్పుడు చిన్న సినిమా కాదు మంచి చిత్రంగా పేరు తెచ్చుకుంది. దర్శకుడు చౌడప్ప గారికి నా అభినందనలు తెలియజేస్తున్నా. ఆయన డైరెక్టర్ గా మరిన్ని మంచి సినిమాలు చేయాలని కోరుకుంటున్నా. టీమ్ అందరికీ కంగ్రాట్యులేషన్స్” అని చెప్పారు.

దర్శకుడు వి సముద్ర మాట్లాడుతూ..”బుల్లెట్ చిత్రం 50 రోజుల వేడుక చేసుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. గోపీచంద్ ప్రభాస్ లాగా ఈ చిత్రంలోని హీరో రవివర్మ కూడా చాలా హైట్ ఉన్నాడు. తను కూడా వాళ్ళ లాగా సక్సెస్ అవ్వాలని కోరుతూ అందరికీ ఆల్ ద బెస్ట్” అని అన్నారు.

హీరో రవివర్మ మాట్లాడుతూ..”మా సినిమాని ఇంతలా సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు. నేను నటించిన మొదటి చిత్రమే 50 రోజులు పూర్తి చేసుకోవడం చాలా హ్యాపీగా ఉంది” అని చెప్పారు.

దర్శకుడు చౌడప్ప మాట్లాడుతూ..”మంచి చిత్రాలను ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. మా చిత్రానికి ఇంత పెద్ద విజయాన్ని ఇచ్చిన ప్రతి ఒక్కరికి థాంక్స్” అని చెప్పారు.

నిర్మాత గోపాల్ గారు మాట్లాడుతూ..”ఈ సినిమా విజయం పై మొదటి నుంచి నమ్మకంగా ఉన్నాం. అనుకున్నట్టుగా విజయం సాధించడంతో పాటు 50 రోజులు వేడుక జరుపుకోవడం చాలా సంతోషంగా ఉంది. దర్శకుడు చౌడప్ప పడ్డ కష్టానికి ప్రతిఫలం దక్కింది. ఆయనకు నా అభినందనలు తెలియజేస్తున్నా” అని అన్నారు. చిత్ర యూనిట్ అంతా ఈ కార్యక్రమంలో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

నటీనటులు హీరో రవి వర్మ, సంజనా సింగ్, ఆలోక్ జైన్ ,మనీషా దేవ్, జీవ ,విజయ రంగరాజు ,సంధ్య శ్రీ, నర్సింగ్ యాదవ్, జబర్దస్త్ అప్పారావు, సందీప్ రెడ్డి ,ఆనంద్ జాషువా, వైజాగ్ ప్రసాద్ ,గిరిధర్, మల్లికార్జున రావు, జగన్ తదితరులు

# ప్రభుదేవ నటించిన సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ మూవీ ప్రేమికుడు ప్రపంచవ్యాప్తంగా మే 1న 300 థియేటర్లలో అద్భుతమైన బుకింగ్స్ తో గ్రాండ్ రీ రిలీజ్

మెగా ప్రొడ్యూసర్ కే. టి. కుంజుమోన్ నిర్మాతగా, సెన్సేషనల్ డైరెక్టర్ ఎస్. శంకర్ దర్శకత్వంలో, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏ. ఆర్. రెహమాన్ మ్యూజిక్ అందించగా ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవ, అందాల నటి నగ్మ నటించిన ప్రేమికుడు సినిమా రీ-రిలీజ్ అవబోతోంది. ప్రస్తుతం ఈ సినిమా రిలీజ్ నిర్మాతలుగా రమణ గారు, మురళీధర్ గారు వ్యవహరిస్తున్నారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం, వడివేలు, రఘువరన్, గిరీష్ కర్నాడ్ ముఖ్యపాత్రలో నటించారు. ఈ రీ రిలీజ్ కి సంబంధించిన వేడుక నేడు చాలా ఘనంగా జరిగింది. ఈ వేడుకలో నిర్మాతలు మురళీధర్ రెడ్డి, రమణ, ప్రముఖ నిర్మాత లగడపాటి శ్రీనివాస్ మరియు శోభారాణి గారు పాల్గొన్నారు. 30 సంవత్సరాల క్రితం వచ్చిన ప్రేమికుడు సినిమా మళ్లీ మే 1న 300 కు పైగా థియేటర్లలో ఘనంగా రి రిలీజ్ అవుతోంది. బుకింగ్స్ ఓపెన్ అయి ప్రజల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఎస్. శంకర్ దర్శకత్వంలో ఇండియన్ మైఖేల్ జాక్సన్ ప్రభుదేవా, నగ్మా జంటగా 30 సంవత్సరాల క్రితం వచ్చి యువతను ఆకట్టుకున్న సినిమా. ఇప్పటికి కూడా ఆ సినిమాలోని పాటలు యువతనే కాకుండా అందరినీ ఆకట్టుకుంటూనే ఉన్నాయి. ఈ సినిమాలో ప్రభుదేవా తండ్రిగా ఎస్. పి. బాలసుబ్రమణ్యం గారు నటించడం సినిమాకే పెద్ద ప్లస్ అయింది. అందమైన ప్రేమ రాణి చెయ్యి తగిలితే పాటలో ప్రభుదేవా తో సమానంగా ఎస్. పి. బాలు గారు డాన్స్ చేయడం విశేషం. టేకిట్ ఈజీ పాలసీ, ఓ చెలియా నా ప్రియ సఖియా పాటలు ఇప్పటికీ ఎప్పటికీ ఎవర్గ్రీన్ సాంగ్స్. ఒక మంచి యూత్ ఫుల్ లవ్ స్టోరీ గా వచ్చిన ఈ సినిమా అప్పటి రోజుల్లో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్. నిర్మాత మురళీధర్ రెడ్డి గారు మాట్లాడుతూ : ప్రేమికుడు సినిమాని 30 సంవత్సరాల తర్వాత మళ్లీ సీ ఎం ఆర్ సంస్థ పైన మే 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నాము. బుకింగ్స్ ఓపెన్ చేసిన వెంటనే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. డిస్ట్రిబ్యూటర్లు కూడా మాకు ఎంత సపోర్ట్ చేస్తున్నారు వారికి మా ధన్యవాదాలు. అదేవిధంగా ఈ సినిమా రిలీస్ కి అంగీకరించి మాకు



సహకరిస్తున్న మా మెగా ప్రొడ్యూసర్ కొంచెం మోహన్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాము అన్నారు.

శోభారాణి గారు మాట్లాడుతూ : మురళీధర్ రెడ్డి గారు, రమణ గారు, ప్రేమికుడు సినిమాని మే 1న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. డిస్ట్రిబ్యూటర్లు కూడా ఎంత సపోర్ట్ చేస్తున్నారు. ఇప్పుడు ఈ ప్రేమికుడు సినిమాని 4ఐ క్వాలిటీలో విడుదల చేస్తున్నాము. ఈ సినిమాకి సంబంధించిన టీజర్ మరియు ట్రైలర్ ప్లే చేస్తున్నప్పుడు చాలా మంచి స్పందన లభించింది. ఒక మంచి లవ్ స్టోరీ అదేవిధంగా పొలిటికల్ డ్రామా కూడా ఈ ప్రేమికుడు సినిమాలో ఉన్నాయి. ఇందులో లెజెండరీ సింగర్ ఎస్. పి. బాలసుబ్రమణ్యం గారి నటన అదే విధంగా ఆయన చేసిన డాన్స్ సినిమాకి పెద్ద ప్లస్ గా నిలిచాయి. అప్పుడు ఇప్పుడు ఎప్పటికీ కూడా ఈ సినిమాకి పాటలకి ఇదే స్పందన ఉంటుంది. ఈ ప్రేమికుడు సినిమా రీ రిలీజ్ కి సపోర్ట్ చేస్తున్న అందరికీ ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను అన్నారు.

# మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో నటుడు సాహిల్ ఖాన్ అరెస్ట్

ముంబై: మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో నటుడు సాహిల్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. 40 గంటల పాటు ఛేదన తర్వాత ముంబై పోలీసులు ఛత్తీస్‌గఢ్‌లో పట్టుకున్నారు.

మధ్యంతర బెయిల్‌కు ముంబై కోర్ట్ నిరాకరించడంతో సాహిల్ పరారయ్యాడని పోలీసులు తెలిపారు. దీంతో ఛత్తీస్‌గఢ్ పోలీసుల సహాయంతో 40 గంటలపాటు సాగిన ఆపరేషన్ తర్వాత అరెస్టుచేశామని వెల్లడించారు. ఆదివారం అతడిని ముంబైకి తరలిస్తామని, కోర్టు ముందు హాజరుపరుస్తామని చెప్పారు.

ఈ నెల 13న ముంబై పోలీసుల ఎదుట సాహిల్ ఖాన్ హాజరయ్యాడు. ఈ కేసులో పలువురు స్టార్లతో పాటు నటుడు సాహిల్ పేరు సైతం తెరపైకి వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కేసు విచారణలో పాల్గొనేందుకు సాహిల్ ముంబై పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. మాతుంగా పోలీస్‌లో కేసు నమోదు కాగా.. కేసు దర్యాప్తు కోసం ముంబయి క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఈ కేసులో సిట్‌ను ఏర్పాటు చేసి విచారణ జరుపుతున్నారు. ఈ కేసులో ఇప్పటికే ఒకరిని అరెస్టు చేశారు. మహాదేవ్ బెట్టింగ్ యాప్ కేసులో డిసెంబర్ 2023లో ముంబై సైబర్ సెల్‌లోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) సాహిల్‌తో పాటు మరో ముగ్గురికి సమన్లు జారీ చేసింది. డిసెంబర్‌లో సిట్ ముందు హాజరుకావాలని ఆదేశించింది. అయితే, ఆ సమయంలో సాహిల్ విచారణకు గైర్హాజరయ్యాడు. ఈ కేసులో దాదాపు రూ. 15వేలకోట్ల కుంభకోణం జరిగినట్లు ఆరోపణలున్నాయి. గతేడాది ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరైన రవి ఉప్పల్‌ను స్థానిక అధికారులు దుబాయిలో అదుపులోకి తీసుకున్నారు. ఈడీ ఆదేశాల మేరకు ఇంటర్‌పోల్ జారీ చేసిన రెడ్ కార్నర్ నోటీసుల ఆధారంగా దుబాయి పోలీసులు అరెస్టు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. సాహిల్ సినిమా నటుడే కాకుండా ఫిట్‌నెస్ నిపుణుడు కూడా. స్టయిల్, ఎక్స్‌క్యూజ్ మీ తదితర చిత్రాల్లో నటించాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**